ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 98, పేజీలు - 08
బుధవారం,అక్టోబర్ 07, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## తెలంగాణ కాంగ్రెస్‌లో
# బీసీ సీఎం చర్చ

### సామాజిక వ్యూహమా.? రేవంత్‌కు చెక్ పెట్టడానికా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భవిష్యత్తులో తెలంగాణకు బీసీ నేత ముఖ్యమంత్రి కావడం ఖాయం అని ప్రకటించారు. ఈ ప్రతిపాదనకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు స్వయంగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కూడా మద్దతు ఇస్తారని ఆయన ప్రకటించారు. రేవంత్ రెడ్డి వంటి బలమైన నేత, వచ్చే టర్మ్ కూడా తానే సీఎంనని ప్రకటించుకుంటున్న రేవంత్ రెడ్డి పదవిలో ఉండగానే సీఎం అభ్యర్థి ప్రస్తావన తీసుకురావడం వెనుక ఉన్న అసలు రాజకీయ కోణం ఏంటనే దానిపై రకరకాల చర్చలు ప్రారంభమయ్యాయి.

#### రేవంత్ నాయకత్వాన్ని బలహీనపరుస్తున్నారా?

ఈ వ్యాఖ్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలహీనపరిచేందుకు ఉద్దేశించినేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి సామాజికవర్గం ఆధిపత్యంపై గొంతు విప్పుతున్న బీసీ నేతలకు పీసీసీ అధ్యక్షుడి ప్రకటన కొత్త ఊపిరి పోసినట్లయింది. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో బలమైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత ఉన్న సమయంలో.. అది కూడా పాలన సాగుతున్న మధ్యకాలంలో ఈ వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రభుత్వంపై, సీఎం గ్రాఫ్ పై ప్రతికూల ప్రభావం పడుతుందనే అభిప్రాయం రేవంత్ వర్గీయుల నుంచి వ్యక్తమవుతోంది.

#### రాహుల్ గాంధీ నినాదంతో ఇరుకున పెట్టే ప్రయత్నం

అయితే, ఈ వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్ హైకమాండ్ పక్కా సామాజిక ఇంజనీరింగ్ వ్యూహం ఉందనేది మరొక బలమైన విశ్లేషణ. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ జనాభా ప్రాతిపదికన భాగస్వామ్యం అనే నినాదంతో కుల గణనను ప్రధాన ఎజెండాగా ముందుకు తీసుకెళ్తున్నారు. తెలంగాణలో జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ ఓటు బ్యాంకును కాంగ్రెస్ వైపే తిప్పుకోవడానికి, బీజేపీ విసురుతున్న బీసీ సీఎం ఆకర్షణీయమైన నినాదానికి చెక్ పెట్టడానికే మహేష్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా సాగుతున్న పవర్ పాలిటిక్స్‌కు స్పష్టమైన సంకేతం. రేవంత్ రెడ్డి పార్టీలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా నిరోధించడానికి, తదుపరి అసెంబ్లీ ఎన్నికల నాటికి బీసీ నాయకత్వాన్ని ప్రత్యామ్నాయ శక్తిగా ప్రాజెక్ట్ చేయడానికి పీసీసీ వర్గాలు పావులు

2లో..

## ఓట్ల దొంగలరా.. పీఠం దిగండి

### - 'ఇండియా' కూటమి నిరసనలో హై వోల్టేజ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో ప్రస్తుతం జరుగుతోన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి మంగళవారం ఢిల్లీలో భారీ నిరసన ర్యాలీ చేపట్టింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం (నిర్వచన్ సదన్) వైపు సాగిన ప్రతిపక్ష ఎంపీల ర్యాలీతో ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా, ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే, టిఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. 'ఓట్ చోర్, గద్దీ ఛోడ్' (ఓట్ల దొంగలారా.. పీఠం దిగండి)' అంటూ ఎంపీలు హోరెత్తించారు.

2లో..

## కేసీఆర్, రేవంత్ కుటుంబ ఆస్తులపై
# విచారణ జరపండి

### - హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు రఘునందన్‌రావు లేఖ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య సాగుతున్న రాజకీయ ఆరోపణల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరోపిస్తుండగా.. వాటికి బీఆర్ఎస్ కౌంటర్ ఇస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ గులాబీ నేతలు ప్రతివిమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్, రేవంత్ రెడ్డి కుటుంబాలకు భారీగా ఆస్తులు ఉన్నాయంటూ బీజేపీ కూడా మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ వివాదంలోకి బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కూడా ఎంట్రీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

2లో..

## అమరావతి పనుల్లో
# ఆలస్యం వద్దు

### అధికారులకు చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక

2లో..

# చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ

- స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై ప్రధాన చర్చ
- శక్తిసామర్థ్యాల ఆధారంగానే సీట్ల పంపకంపై నిర్ణయం
- బీసీ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు తర్వాతే ఎన్నికల షెడ్యూల్
- వైసీపీకి ఒక్క స్థానం దక్కకుండా చూడాలనే పట్టుదల



అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ కూటమి నేతల్లో సీట్ల పంపకాలు, పోటీ చేసే స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఉదయం 9.45 గంటలకు ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో భేటీ కాగా, రెండు గంటలపాటు పలు అంశాలపై చర్చించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ భేటీలో పాల్గొనలేదు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైజాగ్ పర్యటన కారణం గా అటెండ్ కాలేక పోతున్నారని పార్టీ నేతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటుపై ఇప్పటికే మాధవ్, చంద్రబాబు మధ్య సమావేశం జరిగినట్లు వెల్లడించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య స్థానాల సర్దుబాటుపై చర్చించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఏ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుంది, ఎలాంటి వ్యూహాలు అనుసరించాలనే దానిపై చర్చలు జరిపారు. అలాగే కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థుల ఎంపికపై, ఈ ఎన్నికల్లో కూటమి అనుసరించాల్సిన వ్యూహాలపై సైతం చర్చ జరిగింది.

2లో..

# 45 ఎకరాలు ఎక్కడ ఉందో తేల్చండి

### ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ సమీక్ష

- 45 ఎకరాలపై ఆరా, కేసీఆర్ కుటుంబానికి నోటీసులు! - సర్వేలో 45 ఎకరాల భూమి తేడా ఉన్నట్లు గుర్తింపు
- రికార్డులు సమర్పించాలని కేసీఆర్ కుటుంబానికి నోటీసులు - అదే భూమిలో అమరవీరుల కాలనీ నిర్మాణానికి ఆదేశం
- జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల పరిధిలోని భూముల వ్యవహారం మరోసారి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రికార్డుల ప్రకారం ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో 388 ఎకరాల భూమి ఉండగా క్షేత్రస్థాయి సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో మిగిలిన 45 ఎకరాల భూమి ఎక్కడ ఉందో తేల్చాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. భూముల సరిహద్దులు, రెవెన్యూ రికార్డుల పరిశీలన కోసం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల్లో సర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325 భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో

2లో..

## భారత వాయుసేనకు
# కొత్త చీఫ్

### - అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నూతన అధిపతిగా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు. దీనితో ఆయన భారత వాయుసేనకు 29వ అధిపతిగా నిలవనున్నారు. నైపుణ్యం కలిగిన ఫైటర్ పైలట్ అయిన అశుతోష్ దీక్షిత్‌కు 3,500 గంటలకు పైగా యుద్ధ విమానాలను నడిపిన అపార అనుభవం ఉంది. ఆయన 1986 డిసెంబర్ 6న ఐఏఎఫ్ ఫైటర్ విభాగంలో కమిషన్ పొందారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో మిరాజ్-2000, మిగ్ వేరియంట్లు, జాగ్వార్, కిరణ్, హాక్, తేజస్ వంటి అనేక రకాల యుద్ధ విమానాలను నడిపారు.

2లో..

## వారానికి ఒకసారి వచ్చి
# మీ ఇల్లు చూసుకోండి

### - ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పేదలకు ఇండ్లు నిర్మిస్తోంది. ఇందులో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలో 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్' నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. గాజులరామారంలోని కైసర్‌నగర్ సర్వే నంబర్ 346లో తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టనున్న 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్' నిర్మాణానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

2లో..

# కరువు కాటులో తెలంగాణ

- 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్షం - సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశం
- కేంద్ర సాయం కోరేందుకు ఢిల్లీకి వెళ్లనున్న మంత్రుల బృందం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎల్ నినో ప్రభావంతో తెలంగాణలో కరవు తీవ్రత ఆందోళనకరంగా మారింది. ప్రాథమిక అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని 18 జిల్లాల్లో గల 320 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో మొత్తం 621 మండలాలు ఉండగా, అందులో సగానికి పైగా మండలాలు కరవు కోరల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులపై తక్షణమే సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జజూ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక, రెవెన్యూ, భూగర్భ జల, వ్యవసాయం, పంచాయతీ రాజ్ వంటి వివిధ శాఖల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి, నిబంధనల ప్రకారం కరవు మండలాలను గుర్తించాలని సూచించారు.

2లో..

# మాజీ మావోయిస్టులపై కవిత ఫోకస్

### - తమ పార్టీలోకి రావాలని పిలుపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు వేములవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులు ప్రజాసేవ చేసేందుకు తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు. వారి రాకతో తమ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా, వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కవిత పరిశీలించారు. ఆలయ పునర్నిర్మాణంలో కాంక్రీట్ వాడటాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగమశాస్త్రం

2లో..

# తెలంగాణ కాంగ్రెస్‌లో బీసీ సీఎం చర్చ

కదుపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ పరంగా సొంత బీసీ నేతలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పడం ద్వారా అసంతృప్తిగా ఉన్న బీసీ ఓటర్లకు, ద్వితీయ శ్రేణి నాయకులకు ఆశలు కల్పించే ప్రయత్నం ఇది.

### కాంగ్రెస్‌లో ముందు ముందు బీసీ కార్డ్ రాజకీయం

ఈ పరిణామాలు ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు మంచి పొలిటికల్ వెపన్‌గా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే సీఎం పీఠంపై అసమ్మతి మొదలైంది అని, రేవంత్ రెడ్డిని కుర్చీ దింపేందుకు కాంగ్రెస్ లోపలే కుట్రలు జరుగుతున్నాయనడానికి మహేష్ గౌడ్ కామెంట్సే నిదర్శనం అని ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నాయి. రేవంత్ స్వయంగా బీసీ సీఎంకు మద్దతిస్తారని చెప్పడం ద్వారా అధిష్టానం ఆయనను ఈ అంశంలో ఇరకాటంలో పడేసిందనే అభిప్రాయం కూడా వ్యక్తం చేస్తున్నారు. బీసీ సీఎం వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు రాజకీయ ప్రయోజనం చేకూర్చే వ్యూహంగా కనిపిస్తున్నప్పటికీ, మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఇమేజ్‌కు, పార్టీ అంతర్గత ఐక్యతకు కత్తిమీద సాములా మారాయి. రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి ఈ బీసీ కార్డ్ రాజకీయాలను ఏ విధంగా అధిగమిస్తారు? పార్టీలో తన పట్టును నిలబెట్టుకుంటూనే బీసీ వర్గాలను ఎలా సంతృప్తి పరుస్తారో వేచి చూడాల్సిందే.

# ఓట్ల దొంగలరా.. పీఠం దిగండి

నీతి ఆయోగ్, ఆకాశవాణి భవన్ వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ఎంపీలను అడ్డుకోవడంతో తీవ్ర తోపులాటకు దారితీసింది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీలు బారికేడ్లపైకి ఎక్కి జాతీయ జెండాతో నిరసన తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు ఇతర నాయకులు రోడ్డుపైనే ధర్నాకు దిగారు.

### ప్రియాంక సహా పలువురి నిర్బంధం

నిరసనకారులను అదుపు చేసేందుకు యత్నించిన పోలీసులు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సహా పలువురు నాయకులను అదుపులోకి తీసుకుని బస్సులోకి తరలించారు. అయితే ప్రియాంక గాంధీ బస్సు దిగి మళ్లీ రాహుల్ గాంధీ వద్దకు చేరుకుని ఆకాశవాణి భవన్ ఆవరణలోకి వెళ్లి చెట్టు కింద కూర్చుని నిరసన కొనసాగించారు. కాగా, ఈ నిరసనకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దూరంగా ఉంది.

### కేంద్రం, ఈసీపై మండిపాటు

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ "రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ఓటు హక్కును మోదీ ప్రభుత్వం కాలరాస్తోంది, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వ చేతిలో కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారు. మోదీ, షాలు చెప్పినట్లే ఆయన నడుచుకుంటున్నారు" అని విమర్శించారు. ఎస్ఐఆర్ (సర్) ద్వారా దేశంలో ఏకంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, ఇది భారత రాజకీయ చరిత్రలోనే అతిపెద్ద మోసమని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు.

### ప్రతిపక్షాల ప్రధాన డిమాండ్లు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి, దేశంలో జరుగుతోన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను రద్దు చేయాలి, ఎస్ఐఆర్ ద్వారా తొలిగించిన అర్హులైన ఓటర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలి, రాబోయే ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించాలి, ఫామ్-6 కు సంబంధించిన వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసిన మర్నాడే 'ఇండియా' కూటమి ఈ స్థాయి ఆందోళన చేపట్టడం గమనార్హం.

# చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ

### పవన్ కళ్యాణ్‌కు స్వాగతం పలికిన మంత్రి నారా లోకేష్

సీఎం చంద్రబాబుతో సమావేశం కావడానికి ఉండవల్లి నివాసానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆత్మీయ స్వాగతం పలికారు. కారు వద్దకు వచ్చిన లోకేష్ పవన్ కళ్యాణ్‌ను హత్తుకుని, కరచాలనం చేసి, ఆప్యాయంగా ఇంట్లోకి తీసుకెళ్లారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం భేటీ అయ్యారు.

### బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చ

ఏపీ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. కానీ ఈ అంశం సుప్రీంకోర్టులో ఉన్నందున, దీనిపై ఎలా ముందుకెళ్లాలి, ప్రస్తుతానికి ఏమీ తేలకపోతే పార్టీ పరంగానైనా రిజర్వేషన్లు ఇవ్వాలా అని చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం కూటమి సమన్వయ కమిటీలోని టీడీపీ నుంచి మంత్రి నిమ్మల రామానాయుడు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఇప్పటివరకు మూడుసార్లు జరిగిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు, అభ్యర్థుల ఎంపికపై జరుగుతున్న కసరత్తు వంటి అంశాల్ని వారు పార్టీ అధినేత చంద్రబాబుకు వివరించారు. కూటమి అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలిచేలా కృషి చేయాలని పార్టీ నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.కూటమి పొత్తులో భాగంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నేతలు, కార్యకర్తలు కట్టుబడి ఉండాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఇదివరకే పలుమార్లు సూచించారు. తాము సంస్థాగతంగా అంత పటిష్టంగా లేము అని, పార్టీని మరింత బలోపేతం చేసుకుంటూ, కూటమి పెద్దల నిర్ణయాలకు అనుగుణంగా ఎన్నికల్లో పోటీ చేసి విజయాలు సాధించాలని పలుమార్లు పేర్కొన్నారు.

# అమరావతి పనుల్లో ఆలస్యం వద్దు

శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# కేసీఆర్, రేవంత్ కుటుంబ ఆస్తులపై విచారణ జరపండి

కుటుంబానికి సంబంధించిన ఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలని రఘునందన్ రావు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై మరొకరు చేస్తున్న ఆస్తుల ఆరోపణల్లో నిజానిజాలను వెలికితీయాలని కోరారు. ఈ ఫిర్యాదును ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)గా లేదా విచారణకు సంబంధించిన ఇతర తగిన రూపంలో స్వీకరించాలని హైకోర్టు జస్టిస్‌ను విజ్ఞప్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.రేవంత్ రెడ్డి, కేటీఆర్‌తో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలపై స్వతంత్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని రఘునందన్ రావు పేర్కొన్నారు. అక్టోబర్ 2వ తేదీన తాను చేసిన ప్రకటనకు అనుగుణంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, ఆరోపణలకు సంబంధించిన వివరాలను సేకరించి, అవసరమైన పత్రాలను ఫిర్యాదుకు జతచేసినట్లు చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నప్పటికీ వాటిపై న్యాయపరమైన విచారణ కోరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. అందుకే తానే నేరుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆశ్రయించినట్లు వివరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల రూపాయలు దోచుకుందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారని పేర్కొన్న రఘునందన్ రావు, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో రూ.50 వేల కోట్లు సంపాదించారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో నిజానిజాలు తేల్చేందుకు సమగ్ర విచారణ జరపాలని కోరారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లలో ప్రకటించిన ఆస్తులతో పాటు, వాటికి మించి ఇతర ఆస్తులు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఆరోపణలు నిజమా కాదా అన్నది న్యాయ విచారణ ద్వారానే తేలాలని ప్రజలకు వాస్తవాలు తెలియాలని రఘునందన్ రావు అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించి ప్రతిపక్ష నేతలు ప్రస్తావిస్తున్న మెడికవర్ ఆస్పత్రి, స్కూళ్లు, ఇతర వ్యాపారాలకు సంబంధించిన ఆరోపణలపైనా నిజానిజాలు బయటపడాల్సిన అవసరం ఉందని రఘునందన్ రావు పేర్కొన్నారు. అక్రమంగా సంపాదించినట్లు నిర్ధారణ అయిన సొమ్మును తిరిగి ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా తాను ఫిర్యాదును తపాలా ద్వారా పంపించనున్నట్లు రఘునందన్ రావు తెలిపారు. ఆస్తుల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సమయంలో రఘునందన్ రావు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# 45 ఎకరాలు ఎక్కడ ఉందో తేల్చండి

అధికారులు చేపట్టిన భూ సర్వే వివరాలను పరిశీలించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల మేరకు మొత్తం 388 ఎకరాల భూమి ఉండాలి. అయితే క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు సమాచారం. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, సర్వేలో గుర్తించిన భూమికి మధ్య 45 ఎకరాల తేడా రావడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు.45 ఎకరాల భూమి తేడా రావడానికి కారణాలు ఏంటి భూమి సరిహద్దుల గుర్తింపులో ఏవైనా సమస్యలు ఉన్నాయా రెవెన్యూ రికార్డుల్లో ఏవైనా తప్పులు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించి, పూర్తి వివరాలు అందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎర్రవల్లి, దాని సమీపంలోని వెంకటాపురం గ్రామాల్లో భూముల సర్వేను పూర్తి చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. భూముల సరిహద్దులకు ఆనుకుని ఉన్న మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల నుంచి సంబంధిత రెవెన్యూ రికార్డులు సమర్పించాలని అధికారులు నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. సర్వే నంబర్ 325కు సంబంధించిన భూములపై పూర్తి స్థాయి పరిశీలన జరిపి రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.సర్వే నంబర్ 325లోని భూముల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక ఆదేశం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ఈ కాలనీలో అర్హులైన అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని సూచించినట్లు సమాచారం. జూన్ 2వ తేదీలోగా అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే సర్వే నంబర్ 325లోని భూముల గుర్తింపు పూర్తయిన తర్వాత అర్హులైన స్థానిక రైతులకు భూముల పంపిణీ చేసే అంశాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ రికార్డులు, భూముల పాత సర్వే వివరాలు, ప్రస్తుత స్వాధీన పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడం ద్వారా విస్తీర్ణంలో తేడాకు కారణం తేలే అవకాశం ఉంది. అనంతరం చట్టబద్ధమైన ప్రక్రియ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తదుపరి నిర్ణయాలు తీసుకోనుంది.మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలోని భూములపై గతంలోనూ రాజకీయ చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో సర్వే నంబర్ 325లో విస్తీర్ణానికి సంబంధించి వచ్చిన తాజా వివరాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భూముల రికార్డులు కోరడం, సర్వే నోటిఫికేషన్ విడుదల, అమరవీరుల కాలనీ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు తదుపరి పరిణామాలపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని పెంచుతున్నాయి.

# కరువు కాటులో తెలంగాణ

నైరుతి రుతుపవనాల (జూన్-సెప్టెంబర్) వర్షపాతంతో పాటు 12 ప్రామాణికాంశాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ చివరి నాటికి నివేదికను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఎల్ నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించినందున, దీనికి అవసరమైన సమగ్ర సమాచారంతో మరో నివేదికను సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. కరవు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. త్వరలో మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి, ప్రభావిత మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్రానికి తగిన ఆర్థిక సాయం అందించాలని కోరనుంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో 17 శాతం వర్షపాతం లోటు నమోదైంది. గతంలో సుమారు 235 మండలాల్లో కరవు పరిస్థితులు ఉండవచ్చని అంచనా వేయగా, తాజా అంచనాల్లో ప్రకారం ఆ సంఖ్య 320కి పెరిగింది.

# భారత వాయుసేనకు కొత్త చీఫ్

ఆయన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్‌గా కూడా సేవలందించారు.వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు, ఆయన చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌గా, సెంట్రల్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్ వంటి పలు కీలక సైనిక చర్యల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం (2026), అతి విశిష్ట సేవా పతకం (2023) వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. ప్రస్తుతం భారత వాయుసేన ఆధునికీకరణ, యుద్ధ విమానాల సంఖ్య పెంపు దిశగా అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో ఎయిర్ డిఫెన్స్, మానవరహిత యుద్ధ సామర్థ్యాల పెంపుదల, త్రివిధ దళాల మధ్య సమన్వయం వంటి అంశాలు ఆయన ముందున్న ప్రధాన సవాళ్లు. త్రివిధ దళాల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న దీక్షిత్ నియామకం, ఈ లక్ష్యాల సాధనకు ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది

# వారానికి ఒకసారి వచ్చి మీ ఇల్లు చూసుకోండి

ఈ కార్యక్రమానికి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు 7,500 మంది దరఖాస్తు చేసుకోగా, ఎలాంటి వివక్ష, పక్షపాతం లేకుండా అత్యంత పారదర్శకంగా లాటరీ విధానం ద్వారా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు.

గాజులరామారంలో ఎంపికైన లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన ఇండ్లను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నిర్ణీత కాలపరిమితిలోగా ఇందిరమ్మ టవర్స్ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. 12 నెలల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, లబ్ధిదారులకు చేతికి ఇంటి తాళాలు అందించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. నిర్మాణం పూర్తయ్యాక ఇందిరమ్మ టవర్స్ ప్రారంభోత్సవానికి అప్పుడు తాను, మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే వస్తామని చెప్పారు. క్యూర్ లోకి వచ్చే హైదరాబాద్ పరిధిలోని మొత్తం 23 నియోజకవర్గాల్లోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన ప్రక్రియ నిర్వహిస్తున్నాం.

లబ్ధిదారుల సమక్షంలోనే కాంట్రాక్టర్లను ఉంచి ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అయితే వారంలో ఒకరోజు కనీసం ఒకసారి ఇక్కడికి వచ్చి మీ ఇల్లు ఎలా కడుతున్నాడో చూసుకోవాలని సైతం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు సూచించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులతో కూడిన గృహాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు అవసరమైన రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ఫోకస్ చేసినట్లు చెప్పారు. అలాగే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందన్న ఆయన ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు.

గాజులరామారంలో పేదలు జాగా కొనే పరిస్థితి లేదని, సాధారణంగా ఈ ప్రాంతాల్లో ఇండ్లు కడితే 50 నుంచి 80 లక్షలు అవుతుందని తెలిపారు. చెప్పిన గడువులోగా వ్యక్తిగతంగా కట్టుకునే ఇండ్ల నిర్మాణాలు పూర్తికావు, అలాంటి ప్రభుత్వం కట్టిస్తున్న ఇందిరమ్మ టవర్స్ ఇండ్లు సైతం కాస్త ఆలస్యమవుతాయన్నారు. నిధులు సమకూర్చుకుంటూ 6 గ్యారంటీలు అమలు చేస్తూ, ఇందిరమ్మ ఇండ్లను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. చర్చి, గుడి, మసీదు లాంటివి ఏర్పాటు చేసుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ చొరవ తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు

# మాజీ మావోయిస్టులపై కవిత ఫోకస్

ప్రకారం కృష్ణశిలలతో నిర్మిస్తేనే ఆలయం వందల ఏళ్లపాటు నిలుస్తుందని, చారిత్రక వారసత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. భక్తులు సమర్పించిన గోవులు సరైన మేత, నీరు లేక మరణిస్తున్నాయని, వాటికి కనీసం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు కూడా జరపడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "అడవిని వదిలేసి వచ్చిన మాజీ మావోయిస్టులు ప్రజా జీవితంలోకి రండి మా పార్టీ మీకు మంచి ప్లాట్‌ఫామ్" అని కవిత పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానంగా సిరిసిల్ల-వేములవాడ ప్రాంతంలో సాగునీటి పనులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిశానిర్దేశం కోల్పోయిందని, అందుకే ప్రజలు తమలాంటి కొత్త పార్టీల వైపు చూస్తున్నారని విమర్శించారు. అంతకుముందు, ఆమె శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## అధికార, ప్రతిపక్ష కుటుంబాల
# ఆస్తుల పంచాయతీ

**- విచారించాలని చీఫ్ జస్టిస్‌కు లేఖ రాసిన ఎంపి రఘునందన రావు**

**పటాన్ చెరు** అధికార, ప్రతిపక్ష కుటుంబాల ఆస్తుల పంచాయతీ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ కి మెదక్ ఎంపీ రఘునందన్ రావు లేఖ రాసారు . పత్రికల లో వచ్చిన ఆరోపణల వివరాలను జతపరిచారు. ఆ రెండు కుటుంబాల ఆస్తులపై వెంటనే విచారణ జరపాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుల మధ్య జరుగుతున్న ఆస్తుల పంచాయతీ గురించి విచారణ జరిపించమని ఎవరూ అడగడం లేదంటున్నారు. సోమవారం వరకు చూసి న్యాయ విచారణ జరగని పక్షంలో నేనే అడుగుతూ అన్నారు.ఈ రోజు ఉదయం 10:30 గంటలకు హైకోర్టు తెరిచే సమయానికి డ్రాఫ్ట్ చేసిన ఫిర్యాదు గౌరవ హైకోర్టు న్యాయమూర్తికి ఫిర్యాదు చేశాను. ఇది పిల్ ఒ రూపం లో కానీ విచారణ రూపంలో కానీ వెంటనే స్వీకరించాలని రాతపూర్వక ఫిర్యాదు చేశాను. అక్టోబర్ 2 న నేను చెప్పినట్టుగా ఈ ఫిర్యాదు చేశాను. సీఎం మీద కేటీఆర్, బీఆర్ఎస్ వా మీద సీఎం చేసిన ఆరోపణలు రెండింటిని జతపరిచి తర్జుమా కూడా చేశాను. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిసిగారికి కూడా ఫిర్యాదు చేస్తానని అన్నారు.బీఆర్ ఎస్ వారు కేసీఆర్ కుటుంబం దోచుకుందని చెప్తున్న లక్ష కోట్ల రూపాయలు... రెండున్నర సంవత్సరాల లో రేవంత్ రెడ్డి సంపాదించిన యాభై వేల కోట్ల రూపాయలు మొత్తం ప్రజలకు పంచాలని కోరుతున్న. అటు ప్రతిపక్ష కుటుంబం, ఇటు సీఎం కుటుంబం అఫిడవిట్ల కన్నా ఎక్కువ ఉన్న ఆస్తుల ను వెంటనే గుర్తించి విచారణ చెయ్యాలని గౌరవ హైకోర్టును విన్నవిస్తున్న. రేపే సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కి కూడా రేపే పోస్ట్ ద్వారా పంపిస్తా . వాళ్ళు దోచుకున్నది, వీళ్ళు దోచుకున్నది ప్రజల ముందు పెట్టాలని అది ప్రజలకు పంచాలని కోరుతున్నానని అన్నారు.

## ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల కోసం
# కూటమి నాయకులను నిలదీయండి

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు**

**- మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి**

**- కార్యాలయ మెయిన్‌గేట్ వద్ద ఉద్రిక్తత**

**మంగళగిరి** ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల కోసం గ్రామాలకు వచ్చే కూటమి నాయకులను పేదలు నిలదీయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బడా కంపెనీలకు, కార్పొరేట్లకు సౌకర్యంగా భూములు కేటాయించేందుకు మంత్రి నారా లోకేష్ ఎనలేని ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. నిరంతరం కార్పొరేట్లతోనే లోకేష్ మాట్లాడుతున్నారని, నియోజకవర్గంలోని పేదలతో మాట్లాడేందుకు తీరిక లేదా అని ప్రశ్నించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రతిరోజూ పండుగల పేరుతో ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. పేదలకు అవసరమైన ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రావడం లేదన్నారు. రెండు ఇంజన్ల ప్రభుత్వం, మూడు ఇంజన్ల ప్రభుత్వం అంటూ గొప్పగా చెప్పుకుంటూ కార్పొరేట్ కంపెనీల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు క్షణాల్లో ఎకరా 99 పైసలకే భూములు అప్పగిస్తున్నారని ఆరోపించారు. పేదలకు ఇవ్వడానికి భూములు లేవని చెబుతున్న ప్రభుత్వం, కార్పొరేట్లకు మాత్రం వెంటనే భూములు ఇవ్వడంతో పాటు రుణాలు కూడా మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఎన్నికలకు ముందు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అయితే చెప్పిన మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందన్నారు. రెండు సంవత్సరాల నాలుగు నెలలు గడిచినప్పటికీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంగళగిరి నియోజకవర్గంలో 'మన ఇల్లు ? మన లోకేష్' పేరుతో 5,000 మందికి పట్టాలు ఇచ్చారని, అయితే వాటిపై ఇళ్లు నిర్మించుకునేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. విజయవాడలో ఇళ్ల పట్టాలు ఇస్తూ రూ.52 వేల కోట్ల విలువైన ఆస్తి ఇచ్చినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడడం దారుణమన్నారు. వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.52 వేల కోట్ల రుణ సౌకర్యం కల్పించగలరా అని ప్రశ్నించారు. రోజుకొక పట్టాభిషేకం అంటూ ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం, కిలో బియ్యం రూ.70, ఉల్లిపాయలు రూ.70కి అమ్ముడవుతున్న విషయాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కరెంట్ బిల్లులు తగ్గించామని ముఖ్యమంత్రి సభలో చెప్పినప్పటికీ ప్రజల నుంచి స్పందన రాలేదన్నారు. కరెంట్ బిల్లులు తగ్గడం మాట అటుంచి, పెరుగుతూనే ఉన్నాయని అన్నారు. సంవత్సరం కాలంగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ విచారణ చేయడం లేదని విమర్శించారు. వెంటనే దరఖాస్తులను విచారించి, కార్పొరేషన్ ఎన్నికల్లోపు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఏలూరు జిల్లాలో 200 మొబైల్ ఫోన్ల రికవరీ



**ఏలూరు** జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్‌లో పోలీసులు 200 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.50 లక్షలు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 4,563 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగా, వాటి విలువ సుమారు రూ.11.40 కోట్లు. రికవరీ చేసిన ఫోన్లను అధికారులు సంబంధిత బాధితులకు అందజేస్తున్నారు. మొబైల్ పోగొట్టుకున్న వారు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## వర్షం కారణంగా దెబ్బతిన్న
# అరటి తోటను పరిశీలించిన ఎమ్మెల్యే



**చిట్వేలి** రైల్వేకోడూరు మండలం ఓబనపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా దెబ్బతిన్న అరటి తోటలు, పలు పంట పొలాలను రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ పరిశీలించారు. వర్షం కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న అరటి తోటలు, పంట పొలాలను స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమకు జరిగిన పంట నష్టాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భరోసా ఇచ్చారు. పంట నష్టం వివరాలను అధికారుల ద్వారా సేకరించి, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మధురఫలం..జాడ ఏదీ

**నిజామాబాద్ :** ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం.. మరోవైపు పెరిగిన ఉష్ణోగ్రతలు.. సీతాఫలాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయిపూత దశలోనే ఇబ్బందులు మొదలై.. పిందెలు రాలిపోతుండటంతో చెట్లకు కాసిన కాయలు కూడా పూర్తిస్థాయిలో ఎదగడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా సీతాఫలాల చెట్లు ఉన్నప్పటికీ ఉమ్మడి పాలమూరు జిల్లా మాత్రం వీటికి పెట్టింది పేరు. జిల్లాలో గుట్టలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాల్లో విస్తారంగా ఉండడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇక్కడ పండిన పండ్లను హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారు. అలాగే మహిళ సంఘాల ఆధ్వర్యంలో సీతాఫలాలను ప్రాసెసింగ్ చేసి కంపెనీలకు విక్రయించి ఆదాయం పొందుతారు. ప్రతీ సీజన్ లో సీతాఫలాల సేకరణతోనూ పెద్ద ఎత్తున గ్రామీణ ప్రజలు ఉపాధి పొందుతున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులతో సీతాఫలం దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. సకాలంలో వర్షాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగడంతో పూత, పిందె దశలోనే సీతాఫలం చితికిపోతోంది. కొన్ని పిందెలు రాలిపోగా.. మరికొన్ని కాయలు ఎదగకుండా చెట్లపైనే దెబ్బతిన్నాయి.జూలై నుంచి ఆగస్టు మధ్య పూత పిందెగా మారి, సెప్టెంబర్ మొదటి వారం కల్లా కాయలు పక్యానికి వస్తాయి. కానీ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్సాలు గతి తప్పాయి. రోజుల తరబడి వానలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెట్లకు పిందెలు దక్కలేదు. సాధారణంగా ఒక్కో చెట్టుకు 50 నుంచి 60 కాయలు ఉండాలి. కానీ ప్రస్తుతం పదికి మించి కాయలు కనిపించడం లేదు. సీతాఫలం పంటలో పూత నుంచి కాయ తయారయ్యే దశ కీలకం. ఆ సమయంలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రతలు మారితే పండ్ల ఏర్పాటుపై ప్రభావం పడే అవకాశం ఉంది. వాస్తవంగా సహజంగా పెరిగే సీతాఫలం చెట్ల సంఖ్య కూడా తగ్గుతోంది? దీనికి తోడు ఎల్‌నినో తోడైంది. గుట్టలు తొలగించడం, క్వారీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూముల వినియోగంలో మార్పులతో సహజ సీతాఫలం చెట్ల విస్తీర్ణం తగ్గుతోంది. ఫలితంగా సాధారణ సంవత్సరాలతో పోలిస్తే ఈసారి సరఫరాపై వాతావరణ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.సీతాఫలా దిగుబడి తగ్గడంతో



డిమాండ్ పెరిగింది. దీంతో రేట్లు అమాంతం పెరిగాయి. గతేడాది 15 గ్రాముల నుంచి 180 గ్రాముల వరకు ఉన్న ఒక పండు రూ.5 నుంచి రూ.7 వరకు? ఇంకాస్త పెద్దదైతే రూ.8 నుంచి రూ.10 వరకు విక్రయించారు. గంపల లెక్కన అయితే రూ.200 నుంచి రూ.250 వరకు అమ్మారు. ఇక తాజాగా గ్రామీణ ప్రాంతాల కంటే హైదరాబాద్ వంటి పట్టణాల్లో సీతాఫలాల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఒక్కొక్క సీతాఫలాన్ని నాణ్యత, బరువును బట్టి.. ధర 30 నుంచి 50 వరకు అమ్ముతున్నారు. ఇక ఈ సారి ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల కారణంగా సీజనల్ గా ఉపాధి పొందే వారిపైన తీవ్ర ప్రభావం పడింది. సీతాఫలాలను సేకరించే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ సీజన్ లో కష్టకాలం ఎదురవుతోంది. ఆశించిన స్థాయిలో సీతాఫలాల దిగుబడి కనిపించకపోవడంతో ఉపాధి కోల్పోయారు. వీరికి తోడు ఈ పండ్లను సేకరించన తర్వాత ప్రాసెసింగ్ చేసే మహిళ సంఘాలు సైతం ఖాళీగానే కనిపిస్తున్నారు. గతేడాది ఇదే సమాయానికి దాదాపుగా 60శాతం వరకు సీతాఫలాల ప్రాసెసింగ్ నిర్వహించిన వారికి ఈ సీజన్ లో ఇప్పటివరకు ఒక్క పండు రాలేదు అంటేనే పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఒకప్పుడు గుట్టల దగ్గర.. రోడ్ల పక్కన.. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా కనిపిం చిన సీతాఫలం.. ఇప్పుడు అరుదుగా మారుతోంది. వాతావరణ మార్పులతో దిగుబడి తగ్గడం.. సహజంగా పెరిగే చెట్ల సంఖ్య పడిపోవడం.. రెండూ కలిసి సీతాఫలం ధరలను పెంచుతు న్నాయి. ఎల్‌నినో ప్రభావం తగ్గుతుందా? వచ్చే సీజన్‌లోనైనా సీతాఫలాల వృద్ధికి పరిస్థితులు అనుకూలిస్తాయా చూడాలి

## శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆహ్వానం

- శ్రీశైలంలో ఘనంగా నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలు
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలి

**శ్రీశైలం :** శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, ఈవో వేద పండితులు తో కలిసి సోమవారం ఆహ్వానం అందించారు.తాడేపల్లిలోని మంత్రి నివాసంలో శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావుతో పాటు ఆలయ అర్చకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వేద మంత్రోచ్చారణల నడుమ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వేద ఆశీర్వచనం అందజేసి, శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

**వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు** అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు శ్రీశైల క్షేత్రంలో శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.ఉత్సవాల్లో భాగంగా స్వామివార్లకు, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్రయాగం, చండీయాగం, జపపారాయణాలు, అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణ, స్వామి అమ్మవార్లకు వివిధ వాహన సేవలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.

## మొబైల్ చోరీదారులకు పోలీసుల షాక్..!

- 32 ఫోన్లు రికవరీ చేసి యజమానులకు అప్పగింత
- భద్రాచలంలో 32 పోయిన మొబైల్ ఫోన్ల రికవరీ
- సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించిన పోలీసులు



**భద్రాచలం** భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోయిన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పోలీసులు రికవరీ చేశారు. మొత్తం 32 మొబైల్ ఫోన్లను గుర్తించి, వాటిని సంబంధిత బాధితులు, యజమానులకు భద్రాచలం డీఎస్పీ యం. అరుణ్‌కుమార్ సమక్షంలో మంగళవారం అప్పగించారు.మొబైల్ ఫోన్లు పోయినట్లు బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు వాటి వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఫోన్ల ఆచూకీని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు తిరిగి అందజేయడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ యం. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, బస్సులు, రైల్వే స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్లను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ ఉంచరాదని, మొబైల్ ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అలాగే మొబైల్ ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్, ఇతర వివరాలను పోలీసులకు అందిస్తే, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఫోన్‌ను గుర్తించి రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

## గుప్త నిధుల కలకలం

- బండమీదిపల్లి వద్ద ఓ పురాతన దేవాలయం వద్ద జెసిబితో గుప్త నిధులు తవ్వుతుండగా పోలీసుల దాడులు
- 6 వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మరో ముగ్గురు వ్యక్తులు పరార్
- జెసిబితో పాటు రెండు కార్లు సీజ్
- కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్న యాలాల పోలీసులు

**వికారాబాద్** యాలాల మండలంలో తీవ్ర కల కలం రేపిన గుప్తనిధుల త్రవ్వకాల సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే యాలాల మండలం జుంటిపల్లి శ్రీరాములవారి ప్రాజెక్టు వద్ద ఓ పురాతన ఆలయం వద్ద కొందరు గుప్తనిధులు త్రవ్వకాలు చేపట్టినట్టు సమాచారం అందుకున్న యాలాల పోలీసులు అక్కడ దాడులు జరుపగా ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. పోలీసుల రాకతో మరో ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. ఈ సంఘటన అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్నట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న వారిలో అక్కంపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త తో పాటు మరో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తదితరులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈ దాడిలో ఓ జెసిబి తో పాటు రెండు కార్లను సీజ్ చేసి యాలాల పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు యాలాల ఎస్సై విఠల్ రెడ్డి పేర్కొన్నారు.

## యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ విప్ విజయ రమణారావు



**పెద్దపల్లి** యువత అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాల ని ప్రభుత్వ విప్ విజయ రమణారావు పిలుపునిచ్చా రు. పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లిలో ఆద్య టాక్స్ సొల్యూషన్ కార్యాలయాన్ని విప్ విజయ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువశక్తి దేశాభివృద్ధిలో ఎంతో కీలకమన్నారు. స్వయం శక్తితో ఎదిగి, పలువురికి ఉపాధి కల్పించేలా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యాలయ నిర్వాహకులు, ఉద్యోగులను విప్ అభినం దించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, వేముల రాంమూర్తి, కౌన్సిలర్ పూదరి అనూష మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రెండో గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం



**కరీంనగర్** కొత్తపల్లి లోని స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండో గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొని గిరి ప్రదక్షిణలో భాగస్వాములయ్యారు.కార్యక్రమాన్ని ముందుగా గోమాత పూజతో ప్రారంభించి, అనంతరం హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని భక్తులు గిరి ప్రదక్షిణకు బయలుదేరారు. భక్తులు శాస్త్రోక్త పద్ధతిలో, భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల నామస్మరణలతో మార్మోగాయి. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు.రానున్న మూడో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. జిల్లాలోని వివిధ ఆలయాల పండితులు, అర్చకులను ఆహ్వానించి సన్మానించడంతో పాటు, పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేయాలని నిర్ణయించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు, సేవా కార్యక్రమాలకు కూడా వేదికగా నిలుస్తుందని ఆలయ కమిటీ బండ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఈయొక్క కార్యక్రమంలో డాక్టర్ రాజ భాస్కర్ రెడ్డి, బోగ సుదర్శన్, పెద్ది కొమురయ్య, ముత్యం గణపతి, బండ కిషన్ రెడ్డి, సుమారు రెండు వేలవరకు భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు

## అచలాపూర్‌లో అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ఘన సన్మానం



**తాండూర్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా సేవ, అంకితభావాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ సూచనలతో, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నౌనూరి సుధీర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం తాండూర్ మండలం అచలాపూర్ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నౌనూరి సుధీర్ గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా సేవకు ప్రతీకగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో పసిపిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.దేశ భవిష్యత్తు బాలల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని, చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య అందిస్తూ వారిని భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు పిల్లలను ఎలా ప్రేమగా చూసుకుంటారో, అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారిని అంతే ఆప్యాయతతో చూసుకుంటున్న అంగన్వాడీ దీదీల సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈకార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు కొండు రవి, రేవెల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఈర్ల సంతోష్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అడ్వాల సతీష్, వార్డు సభ్యులు వరిమడ్ల విజయ్, గంగాధరి శ్రీనివాస్, ఏముర్ల రవి కుమార్, బొగరపు సతీష్, కౌటం రమేష్, ఎల్లెల శ్రీనివాస్, సంగర్తి భాణేష్, ఉపేందర్, జూపాక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## భర్తను కడతేర్చిన భార్య..

**మానకొండూరు :** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం గట్టుదుద్దనపల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మద్యానికి బాని సై, నిత్యం ఇంట్లో భార్యను వేధిస్తున్న భర్త దారుణ హత్యకు గురయ్యాడు. భర్త పెట్టే వేధింపులను భరించలేక కట్టుకున్న భార్యే అర్ధరాత్రి ఇటుక రాయితో తలపై మోది హత్య చేసింది. అనంతరం ఆమె నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం గట్టుదుద్దనపల్లి గ్రామానికి చెందిన టప్ప రమేష్ (43) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ, ప్రస్తుతం ఆటో నడుపుతున్నాడు. ఆయనకు భార్య సుమలత, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరు, కుమారుడు చదువుకుంటున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం భార్య సుమలత రమేష్‌కు ఆటో కొనిచ్చినట్లు సమాచారం.అయితే కొంతకాలంగా టప్ప రమేష్ మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడటంతో పాటు కుటుంబ సభ్యులను తీవ్రంగా వేధించేవాడు. ఇంట్లో తరచూ గొడవలు చేస్తూ భార్యను నిత్యం వేధిస్తుండటంతో సుమలత మానసిక క్షోభకు గురైంది. రోజురోజుకూ అతని ప్రవర్తన హద్దుమీరడంతో విసిగిపోయిన ఆమె.. సోమవారం అర్ధరాత్రి మరోసారి గొడవ జరిగిన సమయంలో తీవ్ర ఆవేశానికి, అసహనానికి గురైంది. ఈ క్రమంలో ఇద్దరూ పెనుగులాడుతుండగా ఇటుక రాయి తీసుకుని రమేష్ తల పై బలంగా మోది హత్య చేసినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలపాలైన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసుల దర్యాప్తు..: ఈ ఘటన పై సమాచారం అందుకున్న మానకొండూరు సీఐ శ్రీలత వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడు రమేష్ భార్య సుమలత స్వస్థలం గోదావరిఖని అని పోలీసులు గుర్తించారు. ఘటన అనంతరం సుమలత స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నా రు. ఈ దారుణ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నిత్యం జరిగే గొడవలు, కుటుంబ కలహాల కారణంగా నిండు ప్రాణం బలి కావడంతో ఆ గ్రామంలో తీవ్ర కలకలం రేగింది. పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 47వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్** నగర అభివృద్ధి... సంక్షేమానికి మా పాలకవర్గం పెద్దపీట వేస్తోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మంగళవారం 47 వ డివిజన్ లో మేయర్ కొలగాని శ్రీనివాస్ పర్యటించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పోరేటర్ గాజ రమ శివరాం తో కలిసి నగరపాలక సంస్థ కు చెందిన రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం కు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్ లో ఉన్న పెండింగ్ సమస్యలు తనిఖీ చేసి పరిశీలించారు. స్థానిక ప్రజలను పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యలను మేయర్ దృష్టికి తేవడంతో స్పందించిన మేయర్ త్వరలోనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డివిజన్ లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాల ని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ. . కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ నగరపాలక సంస్థ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మా పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి సలహా సూచనలతో నగర ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంలో పెద్ద పీట వేశామని తెలిపారు. బండి సంజయ్ కుమార్ గారి సూచన మేరకు నగరంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించామో అంతకు రెట్టింపుగా ఆడబిడ్డల సంస్కృతి, సాంప్రదాయమైన బడుకమ్మ వేడుకలు, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నగర వ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు కన్నుల పండగలా సాగే బతుకమ్మ వేడుకలకు 66 డివిజన్లలో బతుకమ్మ పాయింట్ల తో పాటు చివరి రోజు నిమజ్జనం పాయింట్ల వద్ద కూడ భారీ ఏర్పట్లు చేసి అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. నగర అభివృద్ధి లో భాగంగా 47 వ డివిజన్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి... ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. నగరపాలక సంస్థ ఎంజిఎఫ్ నిధుల నుండి గతం 20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. అంతే కాకుండా 15 ఫైనాన్స్ నిధుల నుండి 25 లక్షల నిధులతో డివిజన్ లో త్వరలోనే మంచి నీటి పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టి మూడు కాలనీల్లో ప్రజల త్రాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కీంలో ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసి టెండర్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. త్వరలోనే యూసిఎఫ్ నిధులతో నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి నగరాన్ని సుంధర నగరంగా మార్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# రూ.100 పెట్టు.. స్మార్ట్ కార్డు పట్టు

- రేషన్ కార్డు కావాలంటే రూ.100 ఇవ్వాల్సిందేనా.? - సివిల్ సప్లై అధికారులు,డీలర్ల కుమ్మక్కుపై ప్రజల ఆరోపణలు

- రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ.? డీలర్ల చేతుల్లో స్మార్ట్ కార్డులు ఎందుకు.? - సికింద్రాబాద్ సర్కిల్--9లో వసూళ్ల దందాపై ఉన్నతాధికారులు స్పందించాలి



**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ సదుపాయమే కొందరికి వసూళ్ల మార్గంగా మారిందా.? స్మార్ట్ రేషన్ కార్డు చేతికి రావాలంటే రూ.100 చెల్లించాల్సిందేనంటూ సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ సర్కిల్--9 పరిధిలో రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించాల్సి ఉండగా, కార్డు పంపిణీ బాధ్యతలో ఉన్న అధికారుల స్థానంలో డీలర్ల చేతుల్లోనే స్మార్ట్ కార్డులు కనిపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంద రూపాయలు పెట్టు, స్మార్ట్ కార్డు పట్టు.. అన్నట్టుగా పరిస్థితి మారిందని పలువురు వాపోతున్నారు. నిజంగా ఎలాంటి అధికారిక రుసుము లేకపోతే ప్రజల నుంచి డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.




## ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ.?

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో సిబ్బంది, సంబంధిత అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో వారు కనిపించకుండా డీలర్లే అన్నీ తామై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. డీలర్లకు సహకరించడం అధికారుల విధియా.? లేక ప్రజలకు సేవ చేయడమా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.మెట్టుగూడ ప్రాంతంలో 100 రూపాయలు ఇస్తేనే స్మార్ట్ రేషన్ కార్డు ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపిస్తే డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని, చివరకు నష్టపోయేది పేద ప్రజలేనని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే సామాన్యుడి నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కార్యాలయం దూరం.. ఫిర్యాదు చేయాలంటే అన్ని ఇబ్బందులే..

సికింద్రాబాద్‌లో ఉండాల్సిన సివిల్ సప్లై కార్యాలయాన్ని నాంపల్లికి మార్చడంతో స్థానిక ప్రజలకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ సమస్యను చెప్పుకోవడానికి, ఫిర్యాదు చేయడానికి దూర ప్రాంతానికి వెళ్లాల్సి రావడంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.ఒకవైపు రేషన్ కార్డు కోసం ఇబ్బందులు, మరోవైపు ఫిర్యాదు చేయాలంటే కార్యాలయం దూరం.. దీంతో మధ్యలో ప్రజలే నలిగిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎమ్మెల్యే దృష్టి సారించాలి

సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కూడా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. రేషన్ కార్డు వంటి ప్రాథమిక ప్రభుత్వ సేవలోనే డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడం ప్రజాస్వామ్య పాలనకు మచ్చగా మారుతుందని అంటున్నారు. అదేవిధంగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఉండవలసిన కార్యాలయం నాంపల్లికి మార్చడంతో ప్రజలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఇక్కడ వృధాగా ఉన్న అనేక కమ్యూనిటీ హాల్ లను వినియోగించే విధంగా ఎమ్మెల్యే చొరవ తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

## ఉన్నతాధికారులు విచారణ జరపాలి

సర్కిల్--9 పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కార్డులు ఎవరి వద్దకు వచ్చాయి.? ఎవరికి పంపిణీ చేశారు.? లబ్ధిదారుల నుంచి ఎలాంటి డబ్బులు తీసుకున్నారా.? తీసుకుంటే ఎవరి ఆదేశాలతో తీసుకున్నారు.? అనే అంశాలపై ఉన్నత అధికారులు పారదర్శకంగా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన సేవలకు ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. సివిల్ సప్లై శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సికింద్రాబాద్ సర్కిల్--9లో వసూళ్ల దందా జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తారా.? లేక ప్రజల ఫిర్యాదులు కూడా ఫైళ్లలోనే పడి ఉంటాయా.? అనేది వేచి చూడాల్సిందే.

# 25 లక్షల భక్తులు.. దసరాకు పటిష్ఠ ఏర్పాట్లు

- 14న ఇంద్రకీలాద్రికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.15న సరస్ మేళా ప్రారంభం

- మూడు హోల్డింగ్ ఏరియాల్లో 30 వేల మందికి వసతి.. 500 సీసీ కెమెరాలతో నిఘా

- సామాన్య భక్తులే కేంద్రబిందువుగా ఏర్పాట్లు : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి




**విజయవాడ(ప్రశ్న న్యూస్)** విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ ఏడాది సుమారు 25 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రోజుకు సగటున 2.5 లక్షల మంది తరలివచ్చే అవకాశం ఉండటంతో రద్దీ నియంత్రణ, భద్రత, దర్శనం, ఆహారం, తాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం విజయవాడలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు.

## 14న రాష్ట్రపతి రాక

ఈ నెల 14న దేశ ప్రథమ పౌరురాలు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకోనున్నారు. 15న ఆమె సరస్ మేళాను ప్రారంభించనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ప్రత్యేక భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లు చేస్తున్నారు. మూల నక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

## 30 వేల మందికి హోల్డింగ్ ఏరియాలు

భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు మూడు హోల్డింగ్ ఏరియాల్లో ఒకేసారి సుమారు 30 వేల మంది వేచి ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ ప్రసాదం, ఫుడ్ ప్యాకెట్లు, సాంబార్ రైస్, కర్డ్ రైస్, బిస్కెట్లు, మజ్జిగ, తాగునీరు అందుబాటులో ఉంచనున్నారు. అవసరాన్ని బట్టి అదనపు ఆహారం, నీటిని సరఫరా చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

## సామాన్య భక్తులే కేంద్రబిందువు

వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. క్యూ లైన్లలో భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా నిరంతరం పర్యవేక్షించాలని, రద్దీకి అనుగుణంగా క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని సూచించారు. ఆహారం, ప్రసాదం, తాగునీటి నాణ్యతతో పాటు సమయపాలన పాటించాలని, రద్దీ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

## 80 శాతం పనులు పూర్తి

దసరా ఏర్పాట్లలో ఇప్పటికే సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయని దేవాదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ తెలిపారు. ఘాట్ రోడ్డు పనులు పూర్తయ్యాయని, ప్రోటోకాల్ దర్శనానికి రెండు స్లాట్లతో ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. హోల్డింగ్ పాయింట్లలో ఆహారం, మజ్జిగ, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.

## 500 కెమెరాలతో నిఘా

భక్తుల భద్రత కోసం 500 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు. కొండపై అనధికార వాహనాలను నియంత్రిస్తామని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక డైవర్షన్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.'టెక్ దసరా'దసరా ఉత్సవాల్లో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు తెలిపారు. హోల్డింగ్ ఏరియాలు, క్యూ లైన్లలో నిరంతర నిఘా కొనసాగుతుందని చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణకు 'అస్త్రం' యాప్‌ను వినియోగించనున్నట్లు వెల్లడించారు.సమన్వయంతో ముందుకుపోలీసు, దేవాదాయ, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఆర్టీసీ, విద్యుత్, అగ్నిమాపక, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆనం సూచించారు. గత ఏడాది ఎదురైన సమస్యలను ముందుగానే గుర్తించి ఈసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరాతో పాటు విజయవాడ ఉత్సవం, సరస్ మేళా వంటి కార్యక్రమాలు జరుగుతున్నందున నగరంలో భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత భవానీల కోసం మరో మూడు, నాలుగు రోజులపాటు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

# కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ని సందర్శించిన జిల్లా కలెక్టర్

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ని మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలేజీలో మొత్తం ఎంతమంది విద్యార్థులు ఉన్నారు సరిపడా సౌకర్యాలు వసతులు ఉన్నాయా అని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ అదనపు తరగతి గదులు అవసరమని కాలేజీలో ఉదయం ఇంటర్ మధ్యాహ్నం నుండి డిగ్రీ కాలేజీని నిర్వహిస్తున్నామని వివరించారు. కాలేజీలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు కాలేజీ మొత్తం ఎంత స్థలంలో ఉందని కలెక్టర్ అడగగా ప్రిన్సిపల్ మొత్తం మూడు ఎకరాలలో కాలేజీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన టాయిలెట్లు ల్యాబ్లు సరిపడా ఉన్నాయా అని కలెక్టర్ ప్రశ్నించగా ప్రిన్సిపల్ వివరిస్తూ అన్ని సరిపడా ఉన్నాయి కానీ అదనంగా ఏడు తరగతి గదులు అవసరమని వాటిని పై అంతస్తులో నిర్మించాలని కలెక్టర్ ను కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను పంపుతానని వారు పరిశీలించి అంచనాలు ఇస్తారని, ఆ ప్రతిపాదనలు తనకు పంపమని సూచించారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ నాగేంద్ర కుత్బుల్లాపూర్ మండల తహసిల్దార్ రాజేశ్వర్ రెడ్డి , కాలేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు సంక్షేమ పథకాలను

# అదేవిధంగా కృషి చేస్తాం

- గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని సుతారిగూడలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని సుతారిగూడ లో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను పౌర సరఫరాల అధికారులు, స్థానిక రేషన్ డీలర్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమక్షంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, గుండ్ల పోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి గరిసెల సురేందర్ ముదిరాజ్ ,ఓబిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవి ముదిరాజ్ ,గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్, గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్లు బేరి ఈశ్వర్, బండారి నరేందర్ ముదిరాజ్, మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గోమారం రమణారెడ్డి , కండ్ల కొయ్య మాజీ ఉపసర్పంచ్ చిల్ల వెంకటేష్ ముదిరాజు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకార బోయిన మల్లేష్ ముదిరాజ్ , గౌడవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్ వినోద్ గౌడ్ , కర్రోల్ల సంతోష్ ,గుండ్ల పోచంపల్లి సేవాదళ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిల్ల సాయి ముదిరాజ్, చింతల పెంటయ్య ముదిరాజ్ , చింతల భాస్కర్ ముదిరాజ్ , చింతల హరిబాబు ముదిరాజ్ , సుతారిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు ముదిరాజ్ , తదితరులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా గరిసెల సురేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు.రేషన్ కార్డు అనేది పేదవాడి ఆత్మగౌరవమని ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగనివ్వం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక పెద్దలు, మహిళలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియకు నిరసనగా ఇండియా కూటమిఆధ్వర్యంలో నిరసన

- ప్రధాన ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దహనం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** సర్ ప్రక్రియకు నిరసనగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు బచావో, దేశ్ బచావో అంటూ నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అర్హులైన ఓట్లు తొలగిస్తున్నారని అన్నారు. అర్హులైన వారికి ఓటు కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి సత్యం, సిపిఐ మాస్ లైన్ నాయకుడు సదానందం, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, నక్క సందీప్ గౌడ్, గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గువ్వ రవి, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, ఉదండపురం సత్యనారాయణ, సాయి పేట శ్రీనివాస్, వేణుగోపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ఆర్ టి ఏ మెంబర్ భీమిలి జైపాల్ రెడ్డి, రామన్న గారి రాఘవేందర్ గౌడ్, గోమారం బాల్ రెడ్డి, యూసుఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్‌లో తలసాని జన్మదిన వేడుకలు



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** రాజకీయాల్లో తన కంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్ననేత,గత మూడున్నర దశాబ్దాల పాటు ప్రజల మధ్యలో ఉంటూ వారికి సేవలు అందిస్తున్న నాయకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ నిన్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో పుట్టిన రోజు కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించిన బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ బోర్డు సభ్యులు మేడిశెట్టి గిరిధర్.మంగళవారం ఉదయం మార్కెట్ యార్డులో శీనన్న బర్త్ డే సందర్భంగా ఆయన సోదరుడు రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అన్న జన్మదిన వేడుకలో పాల్గొని కేక్ కట్ చేసి ఆయన అభిమానులకు కేక్ తినిపించారు.అలాగే స్కైలాబ్ మాట్లాడుతూ తన సోదరుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కు తెలంగాణ రాష్ట్రంలోనే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అభిమానులు ఉన్నారని,వారు ఎప్పుడూ రాజకీయ నేతగా ఉండరని కుటుంబంలో ఓ పెద్దన్నయ్య లాగా ఉండడం ఆయన గొప్ప తనం అన్నారు.అదిగాక మా పెద్దన్న తలసాని శంకర్ యాదవ్ మా కుటుంబానికి మార్గదర్శకులు.వారు చేసిన సేవలు,ఆయన చూపిన దారి మాకు అభివృద్ధికి సోపానాలు.ఏదేమైనా మాకు,మా కుటుంబానికి మా ఇద్దరు అన్నయ్యలుమణిరత్నాలు అని తెలిపారు.మరో విషయం ఏమిటంటే తలసాని కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన మేడిశెట్టి గిరిధర్.ఈయన వారి కుటుంబంతో గత నాలుగున్నర దశాబ్దాల నుంచి సాన్నిహిత్యం ఉండడంతో ప్రతి కార్యక్రమంలో ఆయన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.ఈ నేపథ్యంలో నిన్న మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా బోయిన్ పల్లి మార్కెట్ లో పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.అదిగాక శీనన్న బర్త్ డే సందర్భంగా విద్యార్థులకు క్రికెట్ కిట్,టీ షర్ట్స్ అందజేసి"గిరి"తన ఉదారతను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంబిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ గజ్జెల నాగేష్,బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, కార్యదర్శి ఆర్వీసీ చంద్రారెడ్డి,బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు డిసి.ప్రభకర్,అంజి,బిక్షపతి, ఎంవీసి.దేవి తదితరులు పాల్గొన్నారు.

# రైతుబజార్ కౌంటర్..

## నెలలో రెండు మూడు రోజులేనా.?



నగరి(ప్రశ్న న్యూస్) నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సన్నబియ్యాన్ని మార్కెట్ ధర కంటే తక్కువకు అందించేందుకు నగరిలో ఏర్పాటు చేసిన రైతుబజార్ కౌంటర్ సక్రమంగా పనిచేయడం లేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. ఆగస్టు 3న ప్రారంభించిన ఈ కౌంటర్ నెలలో రెండు, మూడు రోజులు మాత్రమే తెరుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.సన్నబియ్యం కోసం రైతుబజార్ కౌంటర్‌కు వచ్చే ప్రజలకు తరచూ తలుపులు మూసి ఉండటంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్కువ ధరకు బియ్యం అందించాలనే ఉద్దేశంతో కౌంటర్ ఏర్పాటు చేసినా.. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోందని విమర్శించారు.ఈ మేరకు నగరి ఆర్డీవోకు సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కౌంటర్‌ను క్రమం తప్పకుండా తెరిచి, సన్నబియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా అధికారులు పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సీపీఐ టౌన్ సెక్రటరీ వాలన్, జిల్లా సమితి సభ్యులు షబ్బీర్‌భాష, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ఉత్సవ్‌కు జాతీయ కళ

- తమిళనాడు సీఎం విజయ్‌కు ఆహ్వానం,
- కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలకూ పిలుపు
- దసరా ఉత్సవాలతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని చాటేలా ఏర్పాట్లు



విజయవాడ(ప్రశ్న న్యూస్) విజయవాడలో ఘనంగా నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ స్థాయి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌ను విజయవాడ ఉత్సవ్ ప్రతినిధి బృందం కలిసి ఉత్సవాలకు ఆహ్వానించింది. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలకూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

**కనకదుర్గమ్మ దర్శనానికి పిలుపు** ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, జీఎం హరీష్ బాలయోగితో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తమిళనాడు సీఎం సి. జోసెఫ్ విజయ్‌ను కలిశారు. విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని శ్రీ కనకదుర్గమ్మవారి ఆశీస్సులు పొందడంతో పాటు నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వారసత్వ వైభవాన్ని వీక్షించాలని ఆహ్వానించారు. విజయవాడ ఉత్సవ్ 2.0లోనూ పాల్గొనాలని కోరారు.

**కేంద్ర మంత్రులకూ ఆహ్వానం** రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపీ జీఎం హరీష్ బాలయోగి, విజయవాడ ఉత్సవ్ కమిటీ ప్రతినిధి నరసింహారావు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

**దేశవ్యాప్తంగా చాటేలా..**విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 ద్వారా నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా, చారిత్రక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. వివిధ రాష్ట్రాల ప్రముఖులు, కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఉత్సవ్‌కు మరింత జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.**విజయవాడకు రావాలని ఆశిస్తున్నాం** శ్రీ కనకదుర్గమ్మవారి ఆశీస్సులు పొందేందుకు, విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని ఆస్వాదించేందుకు తమిళనాడు సీఎం సి. జోసెఫ్ విజయ్‌తో పాటు కేంద్ర మంత్రులు విజయవాడకు విచ్చేసి ఉత్సవాల్లో పాల్గొంటారని ఆశిస్తున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు.

# రోడ్డుపై భిక్షాటన చేస్తున్న చిన్నారులను చేరదీసిన జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్

- “చదువుకుంటారా - చదివిస్తా” అంటూ ఆప్యాయంగా పలకరింపు






**జగిత్యాల (ప్రశ్న న్యూస్)** చేతుల్లో పుస్తకాలు పట్టుకుని బడికి వెళ్లాల్సిన చిన్నారులు.. బిక్షాపాత్రలు పట్టుకుని రోడ్డుపై నిల్చున్న దృశ్యం జగిత్యాల పట్టణంలో కలచివేసింది. ఎండను సైతం లెక్కచేయకుండా తల్లిదండ్రులతో కలిసి భిక్షాటన చేస్తున్న నాలుగైదేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులను చూసిన జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ చలించిపోయారు. విధులకు వెళ్తున్న సమయంలో తహసీల్ చౌరస్తా వద్ద ఈ దృశ్యం ఆయన దృష్టికి రావడంతో వెంటనే వాహనాన్ని ఆపి చిన్నారుల వద్దకు వెళ్లారు. చిన్నారులను ఆప్యాయంగా చేరదీసిన సీఐ కరుణాకర్ వారితో కొద్దిసేపు మాట్లాడారు. “చదువుకుంటారా.. మిమ్మల్ని చదివిస్తా” అంటూ వారిలో భరోసా నింపారు. పోలీసు అధికారి వెంట వస్తామని చిన్నారులు చెప్పడంతో వారిని ఆటోలో ఎక్కించి సురక్షితంగా తరలించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారులకు సమాచారం అంది ంచి, చిన్నారుల సంక్షేమం, విద్య, భద్రతకు సంబంధించిన తదుపరి చర్యలు చేపట్టేలా చర్యలు ప్రారంభించారు.సాధారణంగా విధుల్లో భాగంగా వెళ్లిపోకుండా, చిన్నారుల పరిస్థితిని గమనించి వెంటనే స్పందించిన సీఐ కరుణాకర్ చొరవ అభినందనీయం. పోలీసు విధుల్లో నేర నియంత్ర ణతో పాటు సమాజంలోని బలహీన వర్గాలు, ముఖ్యంగా చిన్నారుల భద్రత, సంక్షేమంపై కూడా పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి చాటి చెప్పింది.

# ఎల్లో ప్లేట్ టాక్సీలకు ‘వైట్’ పోటు

- పన్నులు.. పర్మిట్లు.. ఇన్సూరెన్స్ భారమంతా మాదే..
- కిరాయిలు మాత్రం కరువయ్యాయి
- అక్రమంగా కిరాయిలకు తిరుగుతున్న వైట్ ప్లేట్ కార్లతో ఉపాధికి గండి :
- టాక్సీ యజమానుల ఆవేదన
- రవాణాశాఖ తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్



**కైకలూరు(ప్రశ్న న్యూస్)** ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఎల్లో ప్లేట్ (కమర్షియల్) టాక్సీల ఉపాధికి వైట్ ప్లేట్ కార్లు పోటీగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్టబద్ధంగా పన్నులు చెల్లిస్తూ, పర్మిట్లు, ఇన్సూరెన్స్, ఇతర ఖర్చులు భరిస్తున్న తమకు కిరాయిలు దక్కడం లేదని కైకలూరు టాక్సీ యజమానులు, డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత అవసరాలకు ఉద్దేశించిన వైట్ ప్లేట్ కార్లను కొందరు కిరాయిలకు తిప్పుతున్నారని, దీనిపై రవాణాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**స్టాండ్‌లలో ఖాళీగా..**కైకలూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్ల వద్ద ఎల్లో ప్లేట్ టాక్సీలు ప్రయాణికుల కోసం ఎదురుచూస్తున్నా ఆశించిన స్థాయిలో కిరాయిలు లభించడం లేదని డ్రైవర్లు చెబుతున్నారు. రోజంతా వాహనంతో తిరిగినా ఆదాయం అంతంతమాత్రంగానే ఉంటోందని వాపోతున్నారు.ఇదే సమయంలో వైట్ ప్లేట్ కార్లు పెరుగుతున్నాయని, వాటిలో కొన్ని వాహనాలు అక్రమంగా ప్రయాణికులను కిరాయికి తీసుకెళ్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయని యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు. దీంతో చట్టబద్ధంగా వాణిజ్య వాహనాలు నడుపుతున్న తమ ఉపాధిపై ప్రభావం పడుతోందని అంటున్నారు.

**భారం అంతా ఎల్లో ప్లేట్ వాహనాలపైనే..**కమర్షియల్ వాహనాలకు వర్తించే పన్నులు, పర్మిట్ ఖర్చులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర వ్యయాలను క్రమం తప్పకుండా భరిస్తున్నామని టాక్సీ యజమానులు చెబుతున్నారు. మరోవైపు ఇంధన ధరలు పెరగడంతో నిర్వహణ వ్యయం మరింత భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.“మేము నిబంధనలు పాటించి పన్నులు కడుతున్నాం. వాహనాలను కమర్షియల్‌గా నిర్వహిస్తున్నాం. కానీ అక్రమంగా కిరాయిలకు తిరిగే వాహనాల వల్ల మాకే ఎందుకు నష్టం?” అని ప్రశ్నిస్తున్నారు.

**రవాణాశాఖ తనిఖీలు ఎక్కడ?** వైట్ ప్లేట్ వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా కిరాయిలకు తిప్పుతున్నారనే ఫిర్యాదులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని టాక్సీ యజమానులు కోరుతున్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఉపాధి కాపాడాలంటూ వేడుకోలుకైకలూరులో ఎల్లో ప్లేట్ టాక్సీ డ్రైవర్లు, యజమానుల సమస్యలను రవాణాశాఖ అధికారులు, ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని కోరుతున్నారు. చట్టబద్ధంగా టాక్సీ సేవలు అందిస్తున్న తమకు సమాన పోటీ వాతావరణం కల్పించాలని, అక్రమ రవాణాపై చర్యలు తీసుకుని తమ ఉపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నాటిన ప్రతి మొక్కకు లెక్క చెప్పాల్సిందే

- 2047 నాటికి ఏపీకి 50% గ్రీన్ కవర్.. ఈ ఏడాది 10 కోట్ల మొక్కలు
- 500 నర్సరీలు.. నాటినప్పటి నుంచి మహావృక్షమయ్యే వరకు పర్యవేక్షణ
- “ఎక్కడ నాటాం.? ఎన్ని నాటాం.? ఎన్ని బతికాయి.?
- స్పష్టమైన సమాధానం ఉండాలి : నాగబాబు



**మంగళగిరి(ప్రశ్న న్యూస్)** మొక్కలు నాటామని లెక్కలు చూపించడం కాదు.. ఎన్ని మొక్కలు బతికాయన్నదే అసలు లెక్క అని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదల నాగబాబు స్పష్టం చేశారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సరీ నుంచి నాటడం, రక్షణ, మనుగడ, ఎదుగుదల వరకు ప్రతి దశలో బాధ్యత, పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.మంగళగిరి అరణ్యభవన్‌లో మంగళవారం జరిగిన ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తొలి సమావేశంలో 2026--27లో చేపట్టాల్సిన హరిత కార్యక్రమాలపై చర్చించారు.

### 10 కోట్ల మొక్కల లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా నర్సరీల ద్వారా 10 కోట్ల మొక్కలను సిద్ధం చేయాలని నాగబాబు తెలిపారు. తొలి దశలో 500 మండలాల్లో 500 నర్సరీలకు స్థలాలను గుర్తించి 15 వేల ప్రైమరీ బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక నేల, వాతావరణ పరిస్థితులకు సరిపోయే మొక్కలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.
రావి, మర్రి, వేప, చింత, కానుగ, ఉసిరి, పనస, మోదుగ, ఇప్ప, రేల వంటి స్థానిక జాతులను పెంచాలని చెప్పారు. ‘రైట్ ట్రీ--రైట్ ప్లేస్’ విధానాన్ని అమలు చేయాలన్నారు.

### రహదారుల వెంట పచ్చదనం

ప్రతి మండలానికి ప్రత్యేక ప్లాంటేషన్ లక్ష్యాన్ని నిర్దేశించి రహదారుల వెంట పచ్చదనం పెంచాలని నాగబాబు సూచించారు. 3 నుంచి 5 మీటర్ల ఎత్తున్న బలమైన మొక్కలతో ట్రీ బ్యాంకులు ఏర్పాటు చేసి రహదారులు, పట్టణాలు, ప్రభుత్వ ప్రాంగణాల్లో వినియోగించాలని చెప్పారు.పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పట్టణ ఓపెన్ స్పేస్‌లను అవెన్యూ, బ్లాక్, మియావాకీ, డెన్స్ ప్లాంటేషన్లకు వినియోగించాలన్నారు.

### తీరానికి పచ్చని రక్షణ కవచం

రాష్ట్రంలోని సుమారు 1,053 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని పరిరక్షించేందుకు కోస్టల్ గ్రీన్ బెల్ట్, మడ అడవులు, తాటి తోటలను విస్తరించాలని సూచించారు. ‘గ్రేట్ గ్రీన్ వాల్’ కార్యక్రమాలను సమగ్రంగా అమలు చేయాలని చెప్పారు.నర్సరీలను కేవలం మొక్కలు పెంచే కేంద్రాలుగా కాకుండా ‘గ్రీన్ ఎకానమీ సెంటర్లుగా’ తీర్చిదిద్దాలని అన్నారు. యువత, మహిళా సంఘాలకు మొక్కల పెంపకం, సంరక్షణలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.

### నాటిన మొక్కపై డిజిటల్ నిఘా

ఏపీ గ్రీన్ కార్యక్రమాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని నాగబాబు పేర్కొన్నారు. నర్సరీ నుంచి ప్లాంటేషన్ వరకు జియోట్యాగింగ్, డిజిటల్ రికార్డులు, డ్యాష్‌బోర్డును బలోపేతం చేయాలని ఆదేశించారు.
“ఎక్కడ నాటాం? ఎన్ని నాటాం? ఎన్ని బతికాయి?” అనే మూడు ప్రశ్నలకు ప్రతి స్థాయిలో సమాధానం ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి లక్ష్యానికి వ్యక్తిగత బాధ్యతను నిర్దేశించి, ఎవరు అమలు చేస్తారు? ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? నిర్వహణ ఎవరు చేపడతారు? ఎంత సర్వైవల్ రేటు సాధించాలి? అన్నది ముందుగానే ఖరారు చేయాలని సూచించారు.

### మొక్క కాదు.. తరాల భవిష్యత్తు

ఒక విత్తనం నాటినప్పటి నుంచి అది మహావృక్షంగా ఎదిగే వరకు ఐదు దశల్లో పూర్తి బాధ్యత తీసుకోవాలని నాగబాబు అన్నారు. నర్సరీ.. నాటడం.. రక్షణ.. మనుగడ.. ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.

# ప్రకృతి ఒడిలో పర్యాటక విహారం!

- 25 నగరవనాలు.. రూ.13 కోట్లతో 305 హెక్టార్లలో అభివృద్ధి
- ఎకో టూరిజంతో గిరిజన యువతకు ఉపాధి..
- ఆరు నగరవనాలను ప్రారంభించిన పవన్‌కల్యాణ్



**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ప్రకృతి పర్యాటకానికి మరింత ఊతమిచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రజలను ప్రకృతితో మమేకం చేసి ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించడంతోపాటు, ఎకో టూరిజం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. నగర వన యోజనలో భాగంగా రాష్ట్రంలో నూతనంగా అభివృద్ధి చేసిన ఆరు నగరవనాలను మంగళవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు.

### 25 నగరవనాలు

ఇప్పటివరకు రాష్ట్రంలో 19 నగరవనాలు ఉండగా, తాజాగా ప్రారంభించిన ఆరు కలుపుకొని మొత్తం 25 నగరవనాలు అందుబాటులోకి వచ్చాయని పవన్‌కల్యాణ్ తెలిపారు. 305 హెక్టార్లలో రూ.13 కోట్లతో వీటిని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇవి కేవలం మొక్కలు నాటే ప్రాంతాలుగా కాకుండా ప్రజలను ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్లే కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల ఆట స్థలాలు, జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన, ఆహ్లాదకర వాతావరణంలో ఆరోగ్యం, వినోదంతో పాటు ప్రకృతిపై అవగాహన పెంచేలా వీటిని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

### తీర ప్రాంతం.. ఆధ్యాత్మిక పర్యాటకం

బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని నగరవనాలను తీర ప్రాంత పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని పవన్‌కల్యాణ్ తెలిపారు. కోటప్పకొండలో ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. వినుకొండ, దేవరంపాడు, మాచర్లలో ఏర్పాటు చేస్తున్న నగరవనాలు ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.
“ప్రకృతికి దగ్గరైతే ఆరోగ్యం దగ్గరవుతుంది. ప్రకృతి అర్థమైతే పరిరక్షణ బాధ్యత పెరుగుతుంది” అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

### గిరిజన యువతకు ఉపాధి

రాష్ట్రంలో ఎకో టూరిజం విస్తరించడం ద్వారా గిరిజన యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వెలిగోడు జంగిల్ సఫారీ ద్వారా కొత్త అనుభూతిని అందించడంతోపాటు, మారేడుమిల్లిలో ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ వంటి కార్యక్రమాలతో తూర్పు కనుమల అటవీ అందాలను ప్రజలకు చేరువ చేస్తామన్నారు.గిరిజన సంస్కృతి, జీవన విధానాన్ని పర్యాటకులకు పరిచయం చేసేలా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రకృతిని ప్రేమించి, భావితరాలకు దానిని బహుమతిగా అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

### అటవీ పుస్తకాలు ఆవిష్కరణ

ఈ సందర్భంగా అటవీశాఖ రూపొందించిన ‘వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్’, ‘ట్రీ ట్రాన్స్‌లోకేషన్ మాన్యువల్’ పుస్తకాలను పవన్‌కల్యాణ్ ఆవిష్కరించారు. ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ సుస్థిర నిర్వహణ పద్ధతులకు సాధించిన ప్రమాణ్ సర్టిఫికెట్‌ను అటవీశాఖ అధికారులు ఆయన చేతుల మీదుగా అందుకున్నారు.కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ కొణిదల నాగేంద్రబాబు, పలువురు ఎమ్మెల్యేలు, అటవీశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'ది ఇండియా స్టోరీ' మూవీ రివ్యూ!



కాజల్ అగర్వాల్ ప్రధానమైన పాత్రధారిగా రూపొందిన సినిమానే 'ది ఇండియా స్టోరీ'. కోర్టు లీగల్ డ్రామా నేపథ్యంలో రూపొందిన సినిమా ఇది. శ్రేయాస్ తల్పాడే కీలకమైన పాత్రను పోషించిన ఈ సినిమా, జులై 24వ తేదీన థియేటర్లకు వచ్చింది. చేతన్ డీకే దర్శకత్వం వహించిన ఈ సినిమా, సెప్టెంబర్ 18వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. యోగేశ్ పాటిల్ (శ్రేయాస్ తల్పాడే) ఒక ఆర్మీ ఆఫీసర్. అతని ఏడేళ్ల కూతురు పేరే 'పరి' ( త్రిష శ్రద్ధా). హ్యాపీగా జీవితం సాగిపోతుందని అతను అనుకుంటున్న సమయంలో, 'పరి' క్యాన్సర్ బారిన పడుతుంది. ఈ విషయం తెలియగానే అతను తన కూతురును బ్రతికించుకోవాలనే తాపత్రయంతో జాబ్ ను కూడా వదిలేసి వస్తాడు. తమ పూర్వీకులలో ఎవరికీ క్యాన్సర్ లేదని అతను డాక్టర్లతో చెబుతాడు. ఆహార పదార్థాలలో మోతాదుకు మించిన క్రిమి సంహారక మందులు వాడటం వలన, ఆ పాపకి క్యాన్సర్ వచ్చిందని డాక్టర్లు చెబుతారు. అప్పటి వరకూ యోగేశ్ సంపాదించిందంతా ధారపోసినా తన కూతురును బ్రతికించుకోలేక పోతాడు. తన మాదిరిగా ఇంకెవరూ బాధపడకూడదనే ఉద్దేశంతో, అతను ఒక నిర్ణయానికి వస్తాడు. క్రిమి సంహారక మందులు తయారు చేస్తున్న సంస్థలు .. వాటిని పంటల కోసం ఉపయోగిస్తున్న రైతులపై కేస్ పెట్టడం కోసం పోలీస్ స్టేషన్ కి వెళతాడు. తన కూతురు చనిపోలేదనీ .. అది హత్యతో సమానమని ఫిర్యాదు చేయడానికి ప్రయత్నిస్తాడు. అయినా అతని గోడును ఎవరూ పట్టించుకోరు. కోర్టులో కూడా అతనికి ఇదే పరిస్థితి ఎదురవుతుంది. సమాజంలో అతను ఒక నిస్సహాయుడైన తండ్రిగా నిలబడిపోతాడు. తన ఆవేదనను అర్థం చేసుకునేవారు కరువయ్యారని అనుకుంటాడు. అలాంటి పరిస్థితులలో అడ్వకేట్ 'అర్చన' అతనికి అండగా నిలుస్తుంది. ఆ కేస్ ను ముందుకు తీసుకెళ్లడానికి ఆమె సిద్ధమవుతుంది. ఈ క్రమంలో ఎలాంటి భయంకరమైన నిజాలు ఆమె అనుభవంలోకి వస్తాయి? వాటిని ఆమె ఎలా కోర్టు దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుంది? అందుకోసం ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంటుంది? అనేది కథ. వ్యవసాయ రంగంలో పెను మార్పులు వచ్చాయి. ఒకప్పటిలా సేంద్రియ ఎరువులను వాడటం లేదు. పండ్లు .. కూరగాయలు .. ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచడం కోసం .. తాజాగా కనిపించడం కోసం మోతాదుకు మించిన రసాయనాలు ఉపయోగిస్తున్నారు. తినే ఆహారంతో పాటు క్రిమి సంహారిక మందులు లోపలికి వెళ్లడం వలన అనేకమంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం .. క్రిమిసంహారక మందుల తయారీ సంస్థలు .. రైతుల పాత్ర ఉందనే ఒక ప్రధానమైన అంశం చుట్టూ ఈ కథ నడుస్తుంది. కథలోని ప్రధానమైన సమస్య ఏదైతే ఉందో అది కోర్టుకు వచ్చిన దగ్గర నుంచి కథ మొదలవుతుంది. ఆ తరువాత ఈ సమస్య ఎలా కోర్టు వరకూ వెళ్లిందనేది చూపిస్తూ వచ్చారు. ఫస్టాఫ్ అంతా సమస్య చుట్టూ తిరుగుతుంది .. ఆ సమస్యకి గల కారణాలతో సెకండాఫ్ నడుస్తుంది. అసలు ఇండియా వ్యవసాయ రంగంలోకి మోతాదుకు మించిన రసాయనాలు ఎలా ఎంట్రీ ఇచ్చాయనే విషయం దగ్గర నుంచి, వాటి విస్తరణ ఎలా జరుగుతూ వచ్చిందనేది దర్శకుడు వివరిస్తూ వెళ్లాడు. పండ్లు .. కూరగాయలు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తాయని భావిస్తుంటారు. కానీ అవి ఎంతటి విషతుల్యంగా మారిపోయి ప్రజల వరకూ వెళు తున్నాయనే విషయంపై, అవి ఎంతమందిని క్యాన్సర్ పేషంట్లుగా మారుస్తున్నాయనేది న్యాయస్థానం సాక్షిగా ప్రస్తావించారు. అడ్వకేట్ అర్చన తన కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే వైపు నుంచి దర్శకుడు మరికొన్ని విషయాలను మన దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నించాడు. నిజానికి దర్శకుడు ఎంచుకున్న కథాంశం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతుంది. వాస్తవాలకు చాలా దగ్గరగా తీసుకుని వెళుతుంది. తండ్రీ కూతుళ్ల ఎమోషన్స్ ను టచ్ చేస్తూనే దర్శకుడు ఈ కథను చెప్పడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. కాకపోతే అందుకు సంబంధించిన ఆవిష్కరణలో జీవం కనిపించదు. అక్కడక్కడా ఒక డాక్యుమెంటరీ మాదిరిగా అనిపించి అసహనాన్ని కలిగిస్తుంది. కొన్ని లాజిక్కులు వదిలేయడం అసంతృప్తిని మిగుల్చుతుంది. ఇక అడ్వకేట్ అర్చనకి ఇది ఫస్టు కేస్ అని ఎందుకు చెప్పారో .. దాని వలన కథకి ఏం ఒరిగిందనేది అర్థం కాదు. అలాగే మురళీ శర్మ కాంబినేషన్ సీన్స్ కూడా బలహీనంగా అనిపిస్తాయి. కాజల్ .. శ్రేయాస్ తల్పాడే .. బేబీ త్రిష .. ఇలా అంతా తమ పాత్రలకు న్యాయం చేశారు. నిశాంత్ భగవత్ ఫొటోగ్రఫీ .. మంగేష్ నేపథ్య సంగీతం .. ఆశిష్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. దర్శకుడు ఎంచుకున్న కథాంశం వాస్తవాలకు అద్దం పట్టేదే .. ఆలోచింపజేసేదే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అయితే అందుకు తగిన ఆవిష్కరణ జరగలేదు అనిపిస్తుంది. సమస్య తీవ్రత .. ఎమోషన్స్ లో గాఢతను కనెక్ట్ చేయలేకపోయారు. ఒక చర్చా వేదికగా అనిపిస్తూ నిరాశ పరుస్తుంది. అదలా ఉంటే క్యాన్సర్ అనే మాట వినడానికే చాలామంది భయపడతారు. అందునా ఒక పాపకి క్యాన్సర్ అంటే ఆ కథకి ఆడియన్స్ మరింత దూరంగా ఉంటారు. ఫ్యామిలీతో కలిసి చూడకూడని సినిమాలు కొన్ని ఉంటాయి .. చూడలేని కాన్సెప్టులు మరికొన్ని ఉంటాయి. ఆ రెండో కోవలోకి చెందినదిగా ఈ సినిమాను గురించి చెప్పుకోవచ్చు.

# 'రామాయణ'పై భారీ అప్‌డేట్..







భారతీయ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో 'రామాయణ' కూడా ఒకటి. బాలీవుడ్ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ పౌరాణిక ఇతిహాస కథపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. 'రామాయణ'లో బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో కనిపించనుండగా, సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్నారు. కన్నడ స్టార్ యష్ కీలకమైన రావణుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ ముగ్గురు అగ్ర నటులు ఒకే ప్రాజెక్టులో భాగం కావడంతో సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. భారతీయ ఇతిహాసాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన రామాయణ కథను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భారీ స్థాయిలో తెరపై ఆవిష్కరించేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కంటెంట్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. 'రామాయణ' తొలి భాగాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ నిర్ణయించారు. విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ సినిమాకు సంబంధించిన ఒక్కో అప్‌డేట్ బయటకు వస్తుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన తొలి ట్రైలర్‌ను విడుదల చేశారు.

భారీ విజువల్స్, పాత్రల రూపకల్పన, కథకు సంబంధించిన అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ట్రైలర్‌కు మంచి స్పందన రావడంతో రెండో ట్రైలర్‌పై కూడా ఆసక్తి నెలకొంది. ఇప్పుడు 'రామాయణ' నుంచి మరో కీలక అప్‌డేట్ రాబోతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తొలి ట్రైలర్ తర్వాత రెండో ట్రైలర్‌ను కూడా విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమవుతోందనే వార్తలు వినిపిస్తున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లోనే 'రామాయణ' రెండో ట్రైలర్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే రెండో ట్రైలర్ విడుదల తేదీపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలు ఎంతవరకు నిజమన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. 'రామాయణ'కు సంగీతం కూడా ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన హన్స్ జిమ్మర్‌తో పాటు భారతీయ సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇద్దరు అగ్ర సంగీత దర్శకులు కలిసి పనిచేస్తుండటంతో సినిమాకు సంబంధించిన సంగీతంపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా, యష్ నిర్మిస్తున్నారు. కథ, తారాగణం, సాంకేతిక ప్రమాణాలు, సంగీతం ఇలా ప్రతి విషయంలోనూ భారీ స్థాయిని చూపించేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తోంది.

# సంఘర్షణతో జైలర్ ప్రపంచం



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' సినిమా ట్రైలర్ వచ్చేసింది. తెలుగులోనూ విడుదలైన ఈ ట్రైలర్ హై వోల్టేజ్ యాక్షన్‌తో రజనీ మార్క్ స్టైల్, కామెడీ, యాటిట్యూడ్‌తో ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన శైలిలో 'జైలర్' ప్రపంచాన్ని మరింత భారీగా, మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్టు ట్రైలర్ చెబుతున్నది. జైలర్ ముత్తువేల్ పాండియన్‌గా తలైవా మరోసారి తనదైన స్టైల్, మాస్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ సీక్వెల్ మరింత సంఘర్షణలతో, భారీ సవాళ్లతో విస్తృతమైన ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నదని మేకర్స్ చెబుతున్నారు. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రలు పోషించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, విద్యాబాలన్ కథానాయికలు. ఎస్.జె.సూర్య, యోగిబాబు, సూరజ్ వెంజారమూడు ఇతర పాత్రధారులు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో విడుదల చేయనున్నది. ఈ నెల 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: కార్తీక్ కన్నన్, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.

# ఒకరు కాదు ఇద్దరు కాదు..

## - 9 మంది దర్శకులతో 'కామ్రేడ్ కల్యాణ్' ట్రైలర్ లాంచ్



విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర బృందం ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టాలీవుడ్‌కు చెందిన 9 మంది ప్రముఖ దర్శకులు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. రామ్ గోపాల్ వర్మ, హరీశ్ శంకర్, అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, బాబీ, శివ నిర్వాణ, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, రామ్ అబ్బరాజు వంటి అగ్ర దర్శకులు కలిసి ఈ ట్రైలర్‌ను లాంచ్ చేయడం ఇండస్ట్రీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.'కామ్రేడ్ కల్యాణ్' ట్రైలర్ విషయానికొస్తే, ఆద్యంతం నవ్వులు పంచేలా దీన్ని తీర్చిదిద్దారు. ఒక థియేటర్ ఓనర్ అయిన హీరో, అనుకోకుండా 'కామ్రేడ్'గా మారడం, ఆ తర్వాత జరిగే పరిణామాలు ఫన్నీగా ఉంటాయని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. శ్రీవిష్ణు తనదైన కామెడీ టైమింగ్‌తో, మేనరిజమ్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయన తల్లి పాత్రలో సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ నటన, కమెడియన్ సత్యతో సాగే సన్నివేశాలు నవ్వులు పూయించడం ఖాయంగా కనిపిస్తోంది. వెన్నెల కిషోర్, ఉపేంద్ర లిమాయే వంటి నటులు కూడా తమ పాత్రల్లో ఒదిగిపోయారు.

ఈ చిత్రంలో శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, షైన్ టామ్ చాకో కీలకమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న 'కామ్రేడ్ కల్యాణ్' సినిమాను వెంకటకృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. ప్రముఖ రచయిత కోన వెంకట్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.తన సినిమాకు మద్దతుగా నిలిచిన దర్శకులకు కోన వెంకట్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "నా బలం, నా వాళ్లు" అంటూ వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన రాగా, తాజాగా విడుదలైన కామెడీ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. పూర్తిస్థాయి వినోదాన్ని పంచేలా రూపొందిన 'కామ్రేడ్ కల్యాణ్' ఈ నెల 9న థియేటర్లలో విడుదల కానుంది.

# అక్టోబర్ 9న థియేటర్లలోకి ఆధ్యాత్మిక దృశ్యకావ్యం

## - ఆసక్తికరంగా 'హనుమాన్ అంశ్' తెలుగు ట్రైలర్




బాలీవుడ్‌లో చిన్న సినిమాగా వచ్చి బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించిన సంచలనం 'హనుమాన్ అంశ్ ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం హిందీలో భారీ వసూళ్లతో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ ఆధ్యాత్మిక దృశ్యకావ్యాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించేందుకు ప్రముఖ నిర్మాణ సంస్థ 'హోంబలే ఫిల్మ్స్' సిద్ధమైంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేయగా, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో తెరకెక్కన ఈ చిత్రంలో షోభిన్‌సా సత్య ప్రధాన పాత్రలో నటించగా, చందన్ ఆనంద్, పూర్ణిమ తివారి తదితరులు కీలక పాత్రలు పోషించారు. స్టీవ్ జాబ్స్, మార్క్ జుకర్‌బర్గ్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలను సైతం ప్రభావితం చేసిన నీమ్ కరోలి బాబా తత్వం మరియు ఆయన దివ్య ప్రయాణాన్ని ఈ చిత్రంలో కళ్లకు కట్టినట్లు చూపించారు. మాతృమూర్తి మరణం తర్వాత దేవుడి అన్వేషణలో ఇల్లు వదిలివెళ్లిన ఒక చిన్న బాలుడు (లక్ష్మీ నారాయణ్) ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించి నీమ్ కరోలి బాబాగా ఎలా రూపాంతరం చెందారనే కథాంశంతో ఈ సినిమా రూపొందింది.



# రాజభవనంలో నర్తకీమణి

'ఎస్ఆర్ కళ్యాణమండపం' ఫేం శ్రీధర్ గాదె దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్నది. వెంకట్ తలారి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఈశ్వర్ రాచిరాజు, నందు, నిఖిత ప్రధానపాత్రధారులు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర పాత్రధారులు. ఈసినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో నర్తకి పాత్రను పూజిత పొన్నాడ పోషిస్తున్నది. సోమవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాలోని ఆమె పాత్రకు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాజభవనంలో నర్తకీమణిగా మస్తాబైన పూజిత పొన్నాడను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే హారర్ సినిమా ఇదని, సరికొత్త కథ, కథనాలతో సినిమా ఆకట్టుకుంటుందని, ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.

## నిరుపేద కుటుంబానికి అండగా

# కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

**- మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కంఠారెడ్డి.తిరుపతిరెడ్డి అండగా నిలిచారు. రామాయంపేట మండలం సుతారిపల్లి గ్రామానికి చెందిన జెగ్గ పౌలు (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయం గ్రామ బీఆర్ఎస్ నాయకుల ద్వారా తెలుసుకున్న కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5 వేల ఆర్థికసాయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తల ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ నాయకులు పి. ఏసు, జె. సంజీవ్, జె. డానియల్, పి. యేసు కుమార్, దావీదు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ బోర్డు మీటింగ్‌లో

# ఎమ్మెల్యే శ్రీ గణేష్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ కంటోన్మెంట్ సాధారణ బోర్డు సమావేశానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరయ్యారు.బోర్డు సమావేశాల్లో కేవలం సీఈవో దృష్టికి వచ్చిన సమస్యలు మాత్రమే అజెండాగా వస్తున్నాయని, దీనివల్ల భవిష్యత్ ప్రణాళికపై చర్చ జరగడం లేదని ఎమ్మెల్యే శ్రీ గణేష్అన్నారు.నవ కంటోన్మెంట్ నిర్మాణం కావాలంటే అందుబాటులో ఉన్న నిధులను ఎలా,దేనికి,ఏ విధంగా ఖర్చు పెట్టాలో నిర్ణయించే ప్రత్యేక బోర్డు సమావేశం అజెండా లేకుండానే ఏర్పాటు కావాలని కోరినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన క్యూర్ బిల్లుకు ఇటీవల గవర్నర్ ఆమోదం లభించి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో,రోడ్డు వేసే ముందు వివిధ శాఖల మధ్య సమన్వయం చేసుకొని పనులు చేస్తే ప్రజాధనం వృధా కాకుండా ఉంటుందన్నారు.పాత ప్రభుత్వ పబ్లిక్ టాయిలెట్లు ప్రస్తుతం నిరుపయోగంలో ఉండడం,వాటికి బడ్జెట్ కేటాయించి,మహిళల అవసరాలు,క్రీడలు వంటి ప్రయోజనకరమైన కార్యక్రమాలకు ఉపయోగపడేలా చేయాలని సమావేశంలో కోరినట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే పనులకు పూర్తి సహకారం అందించాలని,ముఖ్యంగా వివిధ రకాల ఎన్వోసీలు వెంటనే ఇవ్వాలని కోరారు. ధోబీఘాట్ స్పోర్ట్స్ కాంప్లెక్ కు,కమ్యూనిటీ హాళ్లకు, పార్కుల అభివృద్ధి,క్రీడా కార్యకలాపాలు,చిన్న క్రీడా సముదాయాల కోసం నిధులు మంజూరయ్యాయని. ఎన్వోసీలు,పేపర్ వర్క్ పూర్తయితే ఈ నిధులు వస్తాయని కాబట్టి ఎన్ఓసీలు వేగంగా జారీ చేయాలని అధికారులను సూచనలు చేశారు.వీటికి కంటోన్మెంట్ బ్రిగేడియర్, బోర్డు అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

# మున్సిపాలిటీ పీఠంపై రాజకీయ వేడి








శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి మున్సిపల్ చైర్మన్ పీఠంపై రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. అధికార కూటమి, వైఎస్సార్‌సీపీ మధ్య స్థానిక రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీపై పట్టు సాధించేందుకు ఇరు శిబిరాలు వ్యూహాలు రచిస్తున్నాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి స్థానికంగా తమ బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వంతో సమన్వయం, అభివృద్ధి పనులకు నిధుల సాధన వంటి అంశాలను కూటమి నేతలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో ఆశావహులు, స్థానిక నేతల మధ్య సమీకరణలు కొనసాగుతున్నాయి.మరోవైపు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ కూడా కేడర్‌ను సమీకరిస్తోంది. స్థానిక సంస్థల్లో తమకు ఉన్న పట్టు కొనసాగించేందుకు పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న పార్టీ మార్పులు కూడా స్థానిక రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపుతున్నాయి. మారుతున్న సమీకరణాలు శ్రీకాళహస్తి మున్సిపల్ రాజకీయాల్లో పార్టీ బలంతో పాటు స్థానిక నేతల ప్రభావం, కౌన్సిలర్ల సంఖ్యాబలం, వ్యక్తిగత సంబంధాలు, సామాజిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. ఇరు పార్టీల నేతలు తమ అనుచరులు, కౌన్సిలర్లతో మంతనాలు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.ప్రభుత్వంలో ఉన్న కూటమి ఒకవైపు తన రాజకీయ బలాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తుండగా. స్థానిక స్థాయిలో తమ కేడర్‌ను నిలబెట్టుకోవడంపై వైఎస్సార్‌సీపీ దృష్టి సారిస్తోంది. దీంతో మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందన్న అంశం స్థానిక రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.అయితే తుది సమీకరణాలు ఎలా మారుతాయన్నది కౌన్సిలర్ల సంఖ్యాబలం, స్థానిక రాజకీయ పరిణామాలు, ఎన్నికల సమయంలో ఏర్పడే పొత్తులు తదితర అంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శ్రీకాళహస్తి మున్సిపల్ రాజకీయాలు ఆసక్తికర మలుపులు తిరుగుతున్నాయి.

# నశాముక్త భారత్--టీబీ ముక్త భారత్‌కు

# ప్రజా భాగస్వామ్యం కీలకం: గవర్నర్

**- నశాముక్త మెదక్ దిశగా సమష్టిగా కదలాలి - జీవితానికి అవును.. నషాకు నో' అన్నదే మన నినాదం**

**- డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ పోలీసులకు దేశంలో తొలి ట్రోఫీ రావడం అభినందనీయం - గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**











**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** సమాజంలో మార్పు రావాలంటే ముందుగా ప్రతి ఒక్కరూ తమలో తాము మార్పు తీసుకురావాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ, ఎలాంటి డ్రగ్స్, మాదకద్రవ్యాలు, నషాకు అలవాటు పడబోమని ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలని పిలుపునిచ్చారు.మంగళవారం మెదక్ ఐడీఓసీలో నిర్వహించిన నశాముక్త భారత్ కార్యక్రమంలో గవర్నర్ పాల్గొని, నశాముక్తి ర్యాలీని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశాన్ని నశాముక్తంగా మార్చేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. భారత్ ప్రపంచంలోనే అత్యంత యువ దేశాల్లో ఒకటని, యువశక్తి నషా బారిన పడితే దేశ అభివృద్ధికి తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. "జీవితానికి అవును.. నషాకు నో" అన్న సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

### టీబీ నిర్మూలనకు కృషి చేయాలి

నశాముక్త భారత్‌తో పాటు టీబీ ముక్త భారత్ లక్ష్య సాధనకు కూడా సమష్టిగా కృషి చేయాలని గవర్నర్ అన్నారు. టీబీ పూర్తిగా నయం చేయగల వ్యాధేనని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మందులను క్రమం తప్పకుండా తీసుకుంటే టీబీ నుంచి పూర్తిగా కోలుకోవచ్చని చెప్పారు. నశాముక్తి, టీబీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### ఇంటి నుంచే ఉద్యమం ప్రారంభం కావాలి

నశాముక్తి ఉద్యమం ఇంటి నుంచే ప్రారంభం కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కుటుంబం నుంచి పాఠశాల, గ్రామం, మండలం, జిల్లా స్థాయికి అవగాహన విస్తరించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎవరైనా నషాకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు గుర్తిస్తే మౌనంగా ఉండకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.నశాముక్తి ఒక్కరి బాధ్యత కాదని, "ఇది మనందరి బాధ్యత" అని స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేసినప్పుడే మెదక్‌ను నశాముక్త జిల్లాగా తీర్చిదిద్దగలమన్నారు.

### తెలంగాణ పోలీసులకు అభినందనలు

డ్రగ్స్ నిర్మూలనకు సంబంధించి సమర్థవంతమైన చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినందుకు తెలంగాణ పోలీసులకు దేశంలోనే తొలి ట్రోఫీ లభించడం గర్వకారణమని గవర్నర్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీసులకు గవర్నర్ అభినందనలు తెలిపారు.జూన్ మాసంలో హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి స్టేడియంలో వేలాది మంది విద్యార్థుల సమక్షంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులు, ఇతరులు నశాముక్తి సంకల్పం చేసిన విషయాన్ని గవర్నర్ గుర్తుచేశారు. ఆ సంకల్పాన్ని ఒక కార్యక్రమానికే పరిమితం చేయకుండా ప్రతి పాఠశాల, గ్రామం, కుటుంబానికి తీసుకెళ్లాలని సూచించారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాయకత్వంలో నశాముక్తి సంకల్పాన్ని మెదక్ జిల్లా ప్రజా సంకల్పంగా మార్చాలని అన్నారు. ఎక్కడైనా నషాకు సంబంధించిన కార్యకలాపాలు కనిపిస్తే పోలీసు, పౌర పరిపాలన సమన్వయంతో తక్షణమే సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రూపొందించే కార్యాచరణకు అనుగుణంగా అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నశాముక్త మెదక్.. టీబీ ముక్త మెదక్.. ఆరోగ్యవంతమైన, సురక్షితమైన, శక్తిమంతమైన సమాజం లక్ష్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు.మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి , ఎంపీ శ్రీ మాధవనేని రఘునందన్ రావు,ఎమ్మెల్యే రోహిత్ రావు, లు మాట్లాడుతూ నషా ముక్త్ మెదక్, నషా ముక్త్ తెలంగాణ కు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని చెప్పారు.అంతకుముందు నషా ముక్త్ భారత్ సెల్ఫీ పాయింట్వద్ద గవర్నర్ మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి , ఎంపీ శ్రీ మాధవనేని రఘునందన్ రావు,ఎమ్మెల్యే రోహిత్ రావు కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం మహిళా శక్తి స్టాల్ లను సందర్శించారు.స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు.కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్ ఘన స్వాగతం

నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మెదక్ ఐ డి ఓ సి కు చేరుకున్న గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా కుమంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి , ఎంపీ శ్రీ మాధవనేని రఘునందన్ రావు,ఎమ్మెల్యే రోహిత్ రావు,జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డీవి శ్రీనివాస రావుఅదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్టీవో రమాదేవి, లు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.ఆ వెంటనే పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.నషా ముక్త్ తెలంగాణ, నషా ముక్త్ భారత్ కు మీడియా సహకారం అందించాలి: గవర్నర్అనంతరం ఐడిఓసి వద్ద పాత్రికేయుల సమావేశంలో గవర్నర్ మాట్లాడారు.2029 వరకు తెలంగాణ రాష్ట్రంలో మత్తు పదార్థాలు లేని రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలవాలని గవర్నర్ ఆకాంక్షించారు.హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం లాగా తెలంగాణలో ప్రతి ఇంటికి చైతన్యవంతం చేసేందుకు మీడియా సహకరించాలని గవర్నర్ పిలుపునిచ్చారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మత్తు పదార్థాలు లేని భారతదేశంగా 2029 వరకు చేయాల్సిన సంకల్పంతో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమ ప్రచారంలో దేశంలో మొదటి స్థానంలో నిలిచినందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసులు అభినందించారు.అలాగే ప్రతి నెల ఒక పాఠశాలలో యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలియచేయాలన్నారు భారతదేశ విచ్ఛిన్నకర శక్తులు యువతను పెడదారిలో పెట్టేందుకు మత్తు పదార్థాలకు బానిసలుగా చేసేందుకు కృషి చేస్తున్నారని ఆరోపించారు మత్తు పదార్థాలు సేవించిన విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి ఆదిలోనే మత్తు పదార్థాల దూరంగా ఉంచేందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కృషి చేయాలని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో జూన్ నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల సమక్షంలో 15 వేల మంది విద్యార్థులతో మత్తు పదార్థాలు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు.ప్రతి పాఠశాలలో విద్యార్థుల చే ప్రతిజ్ఞ చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు

## బీజేపి సిద్ధాంతాలకు ఆకర్శితుడినై పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నా

**- బీజేపి ఇంటలేక్చ్వల్ కన్వీనర్ వెంకటేష్**



సంగారెడ్డి (ప్రశ్న న్యూస్) భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పాలనలోనే పేదలకు నిజమైన న్యాయం, సంక్షేమం చేకూరుతానాయని బీజేపి ఇంటలేక్ష్వల్ కన్వీనర్, కామధేను ఫౌండేషన్ అధ్యక్షుడు పి. వెంకటేష్ అన్నారు. సంగారెడ్డిలో మంగళవారం నాడు యంఎల్సీ సి. అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి లను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. త్వరలో జరగనున్న మహబుబ్‌నగర్ – రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ ఎన్నికల్లో బీజేపి అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించేలా మద్దతివ్వాలని ఎంఎల్సీ. అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా బీజేపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిలను కోరారు. తాను మహబుబ్‌నగర్ వాసినని ఆ ప్రాంతంతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు. మహబుబ్‌నగర్ రంగారెడ్డి జిల్లాల భౌగోళిక స్థితిగతులపై తనకు అవగాహన ఉందని, తనకు బీజేపి ఎంఎల్సీ అభ్యర్థిగా అవకాశం ఇస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందనే నమ్మకం తనకు ఉందని చెప్పారు. తాను విద్యార్థి దశ నుండే ఏబివిపి కార్యకర్తగా పనిచేస్తు, బీజేపి సిద్ధాంతాలకు ఆకర్షితుడినై పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నానని చెప్పారు. పార్టీ పట్ల తనకున్న విశ్వాసం, నిబద్ధతతోనే నేను ఈ స్థాయికి ఎదిగానని, పార్టీ బలోపేతానికై పాటుపడుతున్న నా కృషిని గుర్తించి మహబుబ్‌నగర్ రంగారెడ్డి ఎంఎల్సీ బీజేపి అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించేలా ఆశీర్వదించాలని కోరారు.

## ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకున్న గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వన దుర్గామాత ఆలయాన్ని మంగళవారం గవర్నర్ ప్రెస్ సెక్రటరీ దశరథం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఆలయానికి చేరుకున్న గవర్నర్ ప్రెస్ సెక్రటరీ దశరథానికి ఆలయ ఈఓ మఠం వీరేశం, దేవస్థానం సిబ్బంది, ఆలయ పూజారులు శంకర్ శర్మ, పార్థువ్ శర్మ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఏడుపాయల వన దుర్గామాత ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాశస్త్యం, పూజా కార్యక్రమాల వివరాలను గవర్నర్ ప్రెస్ సెక్రటరీ దశరథానికి వివరించారు. అనంతరం ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించి, అమ్మవారిని దర్శించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రామచందర్ రాజు, ఏపీఆర్ఓ బాబు రావు, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుట్టుచప్పుడు కాకుండా

# పెట్రోల్ దందా..?

- ఘట్కేసర్ నుంచి మల్లాపూర్ వరకు పెట్రోల్ చోరీ ముఠాల హల్‌చల్
- కంపెనీ ట్యాంకర్ల నుంచే పెట్రోల్ మాయం.. అక్రమంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు
- సివిల్ సప్లై, పోలీసుల నిఘా ఎక్కడ.? అధికారులపై పెట్రోల్ మాఫియా ధీమా




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నగర శివారు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా పెట్రోల్ అక్రమ దందా జోరుగా సాగుతోందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఘట్కేసర్, పోచారం, జోడిమెట్ల, మల్లాపూర్, మేడిపల్లి ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని కంపెనీలకు చెందిన పెట్రోల్ ట్యాంకర్ల నుంచి ఇంధనం చోరీ చేసి, అనంతరం దానిని అక్రమంగా విక్రయిస్తున్న ముఠాలు ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం వేళల్లో రహస్య ప్రదేశాల్లో ట్యాంకర్లను నిలిపి ఇంధనం యదేచ్ఛగా తీస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.కంపెనీల నుంచి పెట్రోల్ బంకులకు సరఫరా కావాల్సిన ఇంధనం మార్గమధ్యంలోనే మాయమవుతుందా.? ట్యాంకర్ల నుంచి అక్రమంగా పెట్రోల్‌ను బయటకు తీసి ఎవరు కొనుగోలు చేస్తున్నారు.? ఎక్కడ నిల్వ చేస్తున్నారు.? ఎలాంటి వాహనాల్లో తరలిస్తున్నారు.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు వ్యక్తులు ఈ అక్రమ ఇంధనాన్ని తక్కువ ధరకు అందిస్తూ దందాను విస్తరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## అధికారులు రారు.. మమ్మల్ని ఏం చేయలేరు..?

పెట్రోల్ దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల్లో కొందరు మీడియా సిబ్బంది ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి. మాఫియా ముఠాలకు అధికారుల తనిఖీలపై ఏమాత్రం భయపడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఎప్పుడు వస్తారు.? వచ్చినా మాకు ఏమీ చేయలేదు. వాళ్లకు కావలసింది ప్రతినెలా ఇస్తున్న అన్న ధీమాతో అక్రమ వ్యాపారం సాగుతోందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి నిజమైతే సివిల్ సప్లై, పోలీసు శాఖల్లోని కొందరు అధికారుల నిర్లక్ష్యం లేదా పర్యవేక్షణ లోపాలపై అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

## సివిల్ సప్లై నిఘా ఏదీ.?

పెట్రోలియం ఉత్పత్తుల అక్రమ నిల్వలు, అక్రమ విక్రయాలపై పోలీసు, సివిల్ సప్లై అధికారులు నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ శివారు ప్రాంతాల్లో జరుగుతున్న దందాపై అధికారులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ట్యాంకర్లు ఎక్కడ ఆగుతున్నాయి.? సరఫరా మార్గంలో ఎక్కడ ఇంధనం మాయమవుతోంది.? అనుమానాస్పదంగా పెట్రోల్ నిల్వ చేస్తున్న ప్రదేశాలు ఎక్కడ ఉన్నాయి.? అనే విషయాలపై అధికారులకు పూర్తి సమాచారం ఉండి కూడా దాడులు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఉన్నత అధికారుల చేరువతో ఇప్పటికైనా సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

## పోలీసుల పాత్రపై ప్రశ్నలు

ఇంత పెద్ద స్థాయిలో అక్రమ దందా జరుగుతుందన్న ఆరోపణలు వస్తున్నప్పుడు స్థానిక పోలీసుల నిఘా వ్యవస్థ ఏమి చేస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉదయం వేళల్లో ట్యాంకర్ల కదలికలు, అనుమానాస్పదంగా ఇంధనం తరలించే వాహనాలు, అక్రమ నిల్వ కేంద్రాలపై తనిఖీలు నిర్వహిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయినా పోలీసులు మౌనం వహించడం ఎంతవరకు సమంజసం.

## ప్రజల భద్రతతో చెలగాటమా.?

అక్రమంగా సేకరించిన పెట్రోల్‌ను ఎక్కడ పడితే అక్కడ నిల్వ చేయడం, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా తరలించడం జరిగితే భారీ అగ్ని ప్రమాదాలకు దారితీసే ప్రమాదం ఉంది. లాభాల కోసం ఇంధనంతో ఆటలాడుతూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఘట్కేసర్ నుంచి మల్లాపూర్ వరకు ఆరోపణలు వినిపిస్తున్న ప్రాంతాలపై సివిల్ సప్లై, పోలీస్, రెవెన్యూ, సంబంధిత పెట్రోలియం అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ట్యాంకర్ల నుంచి ఇంధనం మాయం అవుతోందన్న ఆరోపణలపై కంపెనీలు కూడా అంతర్గత విచారణ చేపట్టి, సరఫరా పరిమాణాలు,డెలివరీ రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.పెట్రోల్ చోరీ వెనుక ఉన్నది ఎవరు.? అక్రమంగా కొనుగోలు చేస్తున్నది ఎవరు.? అధికారుల కళ్ల ముందే దందా సాగుతోందా.? లేక అధికారుల నిఘా వైఫల్యమే కారణమా.? అన్న ప్రశ్నలకు సంబంధిత శాఖల సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది.

# అవినీతి అంతం సాధ్యమేన

-ఆసియాలోనే అగ్రస్థానంలో భారత్ - అన్ని రంగాల్లో రాజ్యమేలుతున్న అవినీతి - చట్టాల్లోని లొసుగులే అవినీతిపరులకు చుట్టాలు - విద్యా , వైద్యశాఖల్లో 50శాతానికి మించి అవినీతి, అక్రమాలు
- ప్రతి పది మందిలో 8 మంది లంచాలు ఇచ్చినవారే - కేవలం 10 శాతం ఉద్యోగులే నిజాయితితో పని చేస్తున్నారు
- అవినితీ తో పట్టుబడే ఉద్యోగులను శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
- రాజకీయ నాయకుల అవినీతిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో విచారణ జరిపి జీవితాంతం జైల్లోనే ఉండేలా శిక్షలు అమలు చేసి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలిద- దర్యాప్తు సంస్థలల్లో రాజకీయాల ప్రభావం పూర్తిగా నియంత్రించాలి

**(జి టి ఆర్ కె-- ప్రశ్న న్యూస్ బ్యూరో)**




అవినీతికి అంతం లేదా అంటే మానవునిలో వున్న దుష్ట స్వభావం, స్వార్థం మారానంత వరకు సమాజంలో అవినీతి కోరలు చాస్తుందని చెప్పాలి.నీతి - అవినీతి, పదాలు రెండే. కానీ అర్థంలో చాలా తేడా ఉంది. నీతి నైతిక విలువలను నేర్పుతుంది, అవినీతి అనైతికతను ప్రొత్సహిస్తోంది. అందుకు కలిసొచ్చే ఏ ఒక్క అంశాన్ని వదలదు. రెండిటికి నక్కకు నాగలోకానికి ఉన్నంత దూరం. సంపాదించు,అనుభవించు,ఆనందించు ఇది నేటి నీతి. సంపాదించటమే గొప్పతనం. ఎలా సంపాదించామన్నది ముఖ్యంకాదు. బతికినంతకాలం ఆనందించాలి, అనుభవించాలనేదే ప్రధానం. అఒక రంగం అని కాదు, అంతట అవినీతి రాజ్యమేలుతుంది. కాలం కరుగుతోంది. ప్రభుత్వాలు మారుతున్నారు. పాలకులు, పార్టీలు మారుతున్నాయి. అవినీతి అంతు చూస్తామని చెప్పడం తప్ప చేయలేని పరిస్థితి నెలకొంది. ఇక మన దేశం పరిస్థితి చూస్తే ఆసియాలో అత్యంత అవినీతి దేశంగా భారత్ నిలిచింది. ఆసియా ఖండంలోనే దాదాపు 70 నుండి 75 శాతం అవినీతితో భారత్ అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. అయితే భారత్‌ను అవినీతి రహిత దేశంగా మార్చడమే ప్రధాన లక్ష్యమన్న ప్రధాని నరేంద్ర మోడీ మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. అవినీతిని రూపుమాపే దిశగా అడుగులు వేస్తున్నను అందుకు పరిస్థితులు అనుకూలించడం లేకపోను అవినీతే మోడీ అంతు చూసే పరిస్థితులు దాపురించాయి. మన దేశంలో ప్రతీ పది మందిలో 8 మంది ఏదో ఒక సందర్భంలో లంచాలు ఇచ్చిన వారే. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో విద్య, ఆరోగ్యం, పోలీస్, వినియోగ సేవల వంటి ప్రతీ విభాగంలోను అవినీతి రాజ్యమేలుతుందని, భారత్‌లో లంచాల బెడద ఎక్కువగా ఉండటం, ఏదో ఒక సందర్భంలో లంచాలు ఇచ్చినట్లు చాలా మంది ఒప్పుకోవడం గమనార్హం. పబ్లిక్ పాఠశాలు, ఆసుపత్రుల్లో లంచాల బెడద మరి ఎక్కువగా ఉండగా, ప్రాథమిక సౌకర్యాల కల్పనకు లంచాలు చెల్లించాల్సి వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందు గలదు అందు లేదని సందేహం వలదు. అంతా అవినీతి మయం. అది ఇదీ అని లేకుండా దేశంలో ప్రతీ విభాగంలోను అవినీతి తిష్ట వేసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి కూపంలో కూరుకుపోయిన భారతదేశ అవినీతిపై చర్చించుకోవడం తప్ప నిర్మూలనకు ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలితాలు ఇవ్వలేక పోవడం దారుణం.

## అధికార యంత్రాంగం అవినీతి మయం

అధికార యంత్రాంగంలో అవినీతి భాగమైపోవడం దురదృష్టకరం. పలు సంస్థల అంచనా మేరకు కేవలం 10 శాతం ప్రభుత్వోద్యోగులు మాత్రమే అవినీతికి దూరంగా నిజాయితీతో పనిచేస్తుండగా 10 నుంచి 15 శాతం మంది పూర్తిగా అవినీతి ఊబిలో కూరుకుపోయి సంస్కరించడానికి కూడా అనర్హులుగా ఉన్నారని, 70 శాతం మందిని సంస్కరించడానికి అర్హులుగా గుర్తించడం విశేషం. ఏ స్థాయి ఉన్నతాధికారులు, ఉద్యోగులను పట్టుకున్నా కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులు బయట పడుతున్నను అవినీతి అధికారులోఎలాంటి భయం లేకపోవడం గమనార్హం. కారణం ఏసీబీ నమోదు చేసిన కేసుల నుండి సునాయాసంగా తప్పించుకోవడంమే. సీబీఐ, ఏసీబీ, రాష్ట్ర, కేంద్ర విజిలెన్స్ కమిషన్స్, లోకాయుక్త లాంటి సంస్థలు అవినీతిని బహిర్గతం చేసి అరికట్టాల్సింది ఉంది. కాని రాజకీయ ఒత్తిడికిలోనై తమ విధులను సక్రమంగా నిర్వర్తించే సామర్థ్యాన్ని కోల్పోతున్నాయనే విమర్శలు లేకపోలేదు. బహుళ జాతి సంస్థలు, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, వాణిజ్య వేత్తలు, రియల్ ఎస్టేట్ సంస్థలు, రాష్ట్ర, కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు లక్షల కోట్ల విలువ చేసే ప్రజల ఆస్తులను, ధనాన్ని దోపిడీ చేస్తుంటే నివారించే శక్తి పాలకులు, ప్రభుత్వాలకు లేకపోయింది. అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా అవినీతి అంతానికి న్యాయవ్యవస్థ ఇతర సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దురదృష్ట మేమంటే ఆ అత్యున్నత న్యాయస్థానం వైపు కూడా వేలెత్తి చూపించే దుస్థితి దాపురించింది. మనల్ని పట్టి పీడిస్తున్న అవినీతి సమస్యను పూర్తిగా అరికట్టాలి. అది సాధ్యం కాకపోయినా కనీసం నిరోధించాలి. ముందుగా మంచి వ్యవస్థలను తయారు చేయాలి. రాజకీయ వ్యవస్థ, దర్యాప్తు వ్యవస్థలు కలగలిసిపోకుండా చూడాలి. అధికారంలో ఉన్నవారి కోసం పనిచేసే సంస్థలుగా అవి మారకుండా ఉండాలి. అవి పాలకులు చెప్పినంత కాలం అవినీతిని నిర్మూలించడం అసాధ్యమే అన్నది నిజం. రాజకీయపార్టీలు తమ వంతుగా సంస్కరణలు తీసుకు రావాలి.

## అవినీతికి అంతం సాధ్యమేనా

చట్టాల్లోని లొసుగులు అవినీతిపరలకు చుట్టాలుగా మారడంతో నిరోధక సంస్థలు ఎందుకు కొరగానివిగా మారి అవినీతి చేసే వారు యధేచ్ఛగా చేస్తూనే ఉంటున్నారు. జవాబుదారీతనం లేకపోవడం, కఠినమైన శిక్షలు శిక్షలు లేకపోవడంతో ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగులు నిర్భయంగా అవినీతి కి పాల్పడుతున్నారు.అవినీతి వలన చట్టాన్ని అమలు చేయడం ఒక సమస్యగా మారింది. పోలీసు రక్షణ కోసం, ప్రభుత్వ శాఖలలో తొందరగా పనులు కావడం కోసం అవినీతి అనేది సర్వసాధారణమే పోయింది.

## చట్ట సవరణ - కఠిన చర్యలు

జూలు విదిలిస్తున్న అవినీతి ప్రస్తుతం ఉన్న చట్టాలతో అంతమవుతుందనే నమ్మకం సత్ఫలితాలు సాధించ లేకపోవచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల్లోని లోపాలు అవినీతిపరులకు అండగా నిలుస్తున్నాయి. అలాగే రాజకీయ ప్రోద్బలంతో న్యాయవ్యవస్థను సైతం దుర్వినియోగం చేస్తూ అవినీతిని పెంచి పోషిస్తున్నారు. అవినీతికి పాల్పడి పట్టుబడే ప్రభుత్వ ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు చేపట్టి వారిని శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించి వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అలాగే రాజకీయ నాయకులపై వచ్చే అవినీతి ఆరోపణలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి నేర నిరూపణ నిర్ధారణ జరిగితే జీవితాంతం జైలులోనే ఉండేలా శిక్షవేసి వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అవినీతికి పాల్పడాలంటేనే భయపడాల్సిన కఠినచట్టాలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే దర్యాప్తు సంస్థలకు రాజకీయాల నుండి విముక్తి లభిస్తేనే అవినీతి అంతంకు మార్గం సుగమం అవుతుంది. మరి పాలకులు ఈ దిశగా అడుగులు వేస్తారా అనేదానికి వేచి చూడాల్సిందే.

# 2027 ప్రపంచకప్‌కు భారీ డిమాండ్

**- లక్షల్లో టికెట్ దరఖాస్తులు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** 2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచకప్‌పై అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. టికెట్ బ్యాలెట్ ప్రారంభమైన మూడు రోజుల్లోనే పది లక్షలకు పైగా దరఖాస్తులు వెల్లువెత్తడం ఈ మెగా టోర్నీ క్రేజ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ క్రీడా సంబరానికి ప్రపంచవ్యాప్తంగా అపూర్వ స్పందన లభిస్తోంది. ఐసీసీ మంగళవారం వెల్లడించిన గణాంకాల ప్రకారం, ఇప్పటికే 3.2 లక్షల మంది అభిమానులు రిజిస్టర్ చేసుకోగా, మొత్తం 11 లక్షల టికెట్ల కోసం దరఖాస్తులు అందాయి. ఎప్పటిలాగే భారత్-పాకిస్థాన్ పోరుకు అత్యధికంగా 1.10 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత భారత్-దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు 92,000, భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌కు 86,000 దరఖాస్తులు వెల్లువెత్తాయి. నవంబర్ 21న జరిగే ఫైనల్ మ్యాచ్ కోసం కూడా సుమారు 69,000 మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం.
ఈ భారీ స్పందనపై ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా స్పందిస్తూ, "కేవలం 48 గంటల్లోనే 10 లక్షల టికెట్ దరఖాస్తులు రావడం ప్రపంచకప్‌కున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఆఫ్రికా ఖండంలో ఈ టోర్నీ నిర్వహిస్తుండటం ఆఫ్రికా సత్తాను ప్రపంచానికి చాటేందుకు ఒక చక్కని తరుణం" అని పేర్కొన్నారు. స్థానిక ఆర్గనైజింగ్ కమిటీ సీఈఓ ఖొండిసా ఎంగ్వెన్యా మాట్లాడుతూ, ఈ స్థాయి స్పందన టోర్నీపై నెలకొన్న ఆసక్తికి నిదర్శనమని అభివర్ణించారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సాదర స్వాగతం పలుకుతున్నాయి. మా ప్రాంతీయ సంస్కృతిని, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ఆయన తెలిపారు.కాగా, 2027 ప్రపంచకప్ టికెట్ల కోసం ఆసక్తి గల అభిమానులు నవంబర్ 21 వరకు టికెట్ బ్యాలెట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

# హర్మూజ్ జలసంధిలో నౌకపై దాడి

**- 11 మంది భారత నావికులకు గాయాలు**



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) ఒమన్ తీరంలోని హర్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ జలసంధి గుండా ప్రయాణిస్తున్న పనామా జెండాతో కూడిన 'ఎంటీ ఆన్ పీస్' అనే వాణిజ్య నౌకపై మంగళవారం రాకెట్ దాడి జరిగింది. ఈ ఘటనలో 11 మంది భారత నావికులతో సహా మొత్తం 12 మంది సిబ్బంది గాయపడ్డారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నౌకలో మొత్తం 19 మంది సిబ్బంది ఉండగా, వారిలో 17 మంది భారతీయులే. దాడి జరిగిన వెంటనే ఒమన్ అధికారుల సహకారంతో గాయపడిన వారిని సమీపంలోని ఖసాబ్ నగరంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నౌకపై జరిగిన ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. బాధితులను ఆసుపత్రికి తరలించడంలో సహకరించిన ఒమన్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై దాడులు కొనసాగుతుండటంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పౌర మౌలిక సదుపాయాలు, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలని, అంతర్జాతీయ జలమార్గాల్లో నౌకాయానం, వాణిజ్యం సజావుగా సాగేలా చూడాలని పిలుపునిచ్చింది.

# సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్

**- 100 మందికి పైగా ఏజెంట్లు అరెస్ట్!**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న ముఠాలపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఉక్కుపాదం మోపింది. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు దక్షిణ రాష్ట్రాల్లో చేపట్టిన మెగా ఆపరేషన్‌లో 100 మందికి పైగా ఏజెంట్లను అరెస్టు చేసింది. సైబర్ మోసగాళ్లకు 'మ్యూల్' బ్యాంకు ఖాతాలు, కేవైసీ పత్రాలు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో బ్యూరో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. నిందితుల నుంచి మ్యూల్ ఖాతాలకు సంబంధించిన డెబిట్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నమోదైన అనేక సైబర్ క్రైమ్ కేసులతో ఈ నెట్‌వర్క్‌కు సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడిని మోసం చేసి రూ. 11 కోట్లు కాజేసిన కేసు దర్యాప్తులో ఈ అరెస్టులు కీలకంగా మారాయి. బాధితుడి నుంచి దోచుకున్న డబ్బును ఈ మ్యూల్ ఖాతాల్లోకే బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారందరినీ ట్రాన్సిట్ వారెంట్లపై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ మోసాల వెనుక దుబాయ్, ఇతర దేశాల్లోని సైబర్ నేరగాళ్ల హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల ద్వారా సంపాదించిన డబ్బును దాచిపెట్టడానికి, తరలించడానికి సైబర్ నేరగాళ్లు ఈ మ్యూల్ ఖాతాలను ఉపయోగిస్తుంటారు. ఫిషింగ్, పెట్టుబడి మోసాల ద్వారా కొల్లగొట్టిన డబ్బును అసలు సూత్రధారులెవరో తెలియకుండా చేసేందుకు ఈ ఖాతాలు మాధ్యమంగా పనిచేస్తాయి. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసి, ప్రధాన నిందితులను గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588